వరంగల్ వాయిస్
Evening Daily
సంపుటి : 04 | సంచిక : 161
పేజీలు : 08 | వెల: రూ.5/-
శనివారం
మార్చి 22, 2025
www.epaper.warangalvoice.net | www.warangalvoice.net

# ధాన్యం కొనుగోళ్లకు 206 కేంద్రాలు



8లో..

- కలెక్టర్ డాక్టర్ సత్య శారద
- సంబంధిత అధికారులతో కలెక్టరేట్ లో సమీక్ష



2లో..

## తల్లితో వివాహేతర సంబంధం
# బిడ్డనూ వదలని దుర్మార్గుడు

- గర్భం దాల్చిన బాలిక
- తొర్రూరులోని ప్రైవేట్ ఆస్పత్రిలో అబార్షన్



8లో..

# ఏప్రిల్ 14 నాటికి జంక్షన్ సుందరీకరణ పూర్తి

- జిల్లా కలెక్టర్ ప్రావీణ్య
- సంబంధిత శాఖల అధికారులకు ఆదేశం




8లో..

## నాసిరకం పురుగు మందుల విక్రయ
# ముఠా అరెస్ట్

- పోలీసుల అదుపులో ఏడుగురు
- పరారీలో ఒకరు, జైలులో మరొకరు
- వివరాలు వెల్లడించిన సీపీ సన్‌ప్రీత్ సింగ్



# జల గండం

## తాగునీటికోసం తండ్లాట

- కాంక్రీట్ జంగిల్ గా మారుతున్న నగరాలు
- ఆక్రమణకు గురవుతున్న చెరువులు
- అడుగంటుతున్న భూగర్భ జలాలు
- నీటి గుంతలను విస్మరించిన బల్దియా

మానవ మనుగడకు నీరే ఆధారం. నీరుండే ప్రాంతంలోనే నాగరికత పుట్టింది. అంతటి ప్రాముఖ్యం కలిగిన నీటి సంరక్షణను మనం నిర్లక్ష్యం చేస్తున్నాం. ప్రస్తుతం ఉపరితలంలోని నీరే కాదు.. భూగర్భంలో నీటిని కూడా విచ్చలవిడిగా వినియోగించుకుంటూ భవిష్యత్ తరాలకు అన్యాయం చేస్తున్నాం. వాతావరణంలో వస్తున్న మార్పులతో పలు ప్రాంతాల్లో భూగర్భ జల మట్టాలు ప్రమాద స్థాయికి పడిపోతున్నాయి. దీంతో మార్చి మొదటి వారం నుంచే తాగు, సాగు నీటికి తండ్లాట తప్పడం లేదు. కాంక్రీట్ జంగిల్ గా మారుతున్న నగరాలు, పరిమితికి మించి బోర్ల తవ్వకంతో భూగర్భ జలాలు అథఃపాతాళానికి చేరుకుంటున్నాయి. ప్రతి ఏడు మార్చి 22వ తేదీన ప్రపంచ జల దినోత్సవం చేసుకుంటూ ఊకదంపుడు ఉపన్యాసాలు ఇస్తున్నాము తప్ప ఒక్కో నీటి బొట్టును ఒడిసి పట్టాలన్న జ్ఞానాన్ని కోల్పోతున్నాం. ఇంకుడు గుంత ఉంటేనే ఇంటి నిర్మాణానికి అనుమతులు ఇవ్వాలన్న నిబంధన ఉన్నప్పటికీ దానిని పాటించేవారే కరువయ్యారు. అదే విధంగా హనుమకొండ, వరంగల్ పరిధిలో వరపు నీరు నిలువ ఉండే 37 ప్రాంతాల్లో బల్దియా ఆధ్వర్యంలో ఇంకుడు గుంతల నిర్మాణానికి తయారు చేసిన డీపీఆర్ లు అటకెక్కాయి. దీంతో నగరంలో రానున్న రోజుల్లో జల గండం పొంచి ఉంది. – వరంగల్ వాయిస్ ప్రతినిధి



వివరాలు2లో..



# జల గండం

- తాగునీటికోసం తండ్లాట
- కాంక్రీట్ జంగిల్ గా మారుతున్న నగరాలు
- ఆక్రమణకు గురవుతున్న చెరువులు
- అడుగంటుతున్న భూగర్భ జలాలు
- నీటి గుంతలను విస్మరించిన బల్దియా



**వరంగల్ వాయిస్ ప్రతినిధి :** పూడికతీత పనుల్లో భాగంగా నగరంలోని ప్రధాన భద్రకాళి చెరువు ఖాళీ అయింది. దీంతో చెరువు చుట్టు పక్కల ప్రాంతాల్లో భూగర్భ జలాలు అడుగంటాయి. దీంతనితోడు నగర పరిధిలోని అనేక చెరువులు ఆక్రమణ దారుల చెరలోపడి విస్తీర్ణం తగ్గిపోగా అనేక కుంటలు మొత్తానికే కనుమరుగయ్యాయి. దీనికితోడు స్మార్ట్ సిటీ పేరుతో నగరంలోని రోడ్లకు ఇరువైపులా కాంక్రీట్ చేసేశారు. దీనివల్ల వర్షపునీరు భూమిలో ఇంకే అవకాశం పూర్తిగా మూసుకుపోయింది. చాలా దేశాల్లో రోడ్లకు ఇరువైపులా నీరు ఇంకే కాంక్రీట్‌ను వినియోగిస్తుంటారు. చిన్నచిన్న రంధ్రాలు ఉండడంతో నీరు భూమిలోకి ఇంకిపోతుంది. అటువంటి విధానాన్ని మనం ఎక్కడా పాటించిన దాఖలాలు లేవు. పార్కుల్లో కూడా సిమెంట్ నిర్మాణాలే పెరిగాయి.

### రెయిన్ హార్వెస్ట్ విధానం విఫలం..

నగరంలో వర్షపునీరు భూమిలోకి ఇంకే విధానం అమలు పూర్తిగా విఫలమైంది. వ్యక్తిగత గృహం నుంచి అపార్టుమెంట్ వరకూ నిర్మాణ సమయంలో విధిగా ఇంకుడుగుంతలు ఏర్పాటు చేసుకోవాలన్న నిబంధన ఉన్నప్పటికీ దానిని పాటించేవారే కరువయ్యారు. కనీసం పది శాతం మంది కూడా ఇంకుడు గుంతలు ఏర్పాటు చేసుకోవడం లేదన్న విమర్శలున్నాయి. ఇంకుడు గుంతల ఏర్పాటుకు బిల్డర్లు సుముఖత చూపకపోవడం ప్రధాన కారణంగా మారుతోంది. వ్యక్తిగత ఇల్లు కట్టుకునేవారు ఎలాంటి అనుమతి లేకుండా బోరు వేస్తున్నారు తప్ప ఇంకుడు గుంతల ఆలోచన చేయడం లేదు. కనీసం పాఠశాలలు, కళాశాలలు, మైదానాల్లో కూడా ఇంకుడు గుంతలు నిర్వహించడం లేదు. ప్రభుత్వ కార్యాలయాల్లో ఏర్పాటు చేసిన ఇంకుడు గుంతలు అలంకారప్రాయంగా మారాయి.

### జీహెచ్ఎంసీ తరహాలో...

హైదరాబాద్ మహానగర పాలక సంస్థ అమలు చేస్తున్నట్లు వరంగల్ మహానగర పాలక సంస్థ పరిధిలోనూ ఇంకుడు గుంతల నిర్మాణానికి ప్రతిపాదనలు రూపొందించారు. వర్షపు నీరు ఎక్కువగా నిలువ ఉండే వరంగల్, హనుమకొండలోని 37 ప్రభుత్వ స్థలాల్లో వీటిని ఏర్పాటు చేయాలని గత సంవత్సరం జులైలో నిర్ణయించారు. తొలి విడతలో ఏడు కూడళ్లను ఎంపిక చేశారు. హనుమకొండ కొత్త బస్టాండ్ కూడలి సమీపంలోని జేఎన్ఎస్, గోకుల్ నగర్ సెంటర్ సమీపంలోని హనుమకొండ తహసీల్దార్ కార్యాలయంలోని ఖాళీ స్థలం, అలంకార్ కూడలిలోని రిలయన్స్ మాల్ ఎదుట, హంటర్ రోడ్డులోని న్యూశాయంపేట సెంటర్, సీఎస్సార్ సెంటర్లోని లేఅవుట్ ఖాళీ స్థలం, ములుగు రోడ్డు సెంటర్ లోని ప్రభుత్వ ఐటీఐ కళాశాల ఆవరణ, ఎనుమాముల సాయిగణేశ్ కాలనీలోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల ఆవరణలో ఇంకుడు గుంతను తవ్వి పైప్ లైన్ల ద్వారా వర్షం నీటిని అందులోకి మళ్లించేలా ప్రతిపాదనలు రూపొందించారు. ఒక్కో కూడలికి సుమారు రూ.25 లక్షల చొప్పున మొత్తం రూ.1.75 కోట్లు అవసరం ఉంటుందని ప్రాథమికంగా అంచనా వేశారు. ఈ పనుల్లో డీఆర్ఎఫ్, ఇంజినీరింగ్, ప్రజారోగ్య, పట్టణ ప్రణాళిక విభాగాల అధికారులు, క్షేత్రస్థాయి ఉద్యోగులను భాగస్వాములు చేయాలని నిర్ణయించారు.

### అటకెక్కిన ప్రతిపాదన..

బల్దియా ఆధ్వర్యంలో భారీ ఇంకుడు గుంతలు ఏర్పాటు చేయడం ద్వారా భూగర్భ జలాలు పెరగడంతోపాటు లోతట్టు ప్రాంతాలను ముంపునుంచి కాపాడవచ్చని భావించారు. అందులో భాగంగానే నగరంలోని 37 ప్రాంతాల్లో ప్రభుత్వ ఇంకుడు గుంతలతో పాటు కొత్తగా గృహ నిర్మాణానికి అనుమతులు పొందే వారు ఇంకుడు గుంతలను ఏర్పాటు చేయడంద్వారా నగరంలో నీటి కష్టాలు తీరుతాయని అందరూ భావించారు. అయితే తర్వాత ఏమి జరిగిందో కాని ఇంకుడు గుంతల ఏర్పాటు విషయాన్నే అధికారులు, పాలకులు పూర్తిగా విస్మరించారు. ఇప్పటికైనా బల్దియా అధికారులు స్పందించి ఇంకుడు గుంతల నిర్మాణానికి చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.



# తల్లితో వివాహేతర సంబంధం బిడ్డనూ వదలని దుర్మార్గుడు

- గర్భం దాల్చిన బాలిక
- తొర్రూరులోని ప్రైవేట్ ఆస్పత్రిలో అబార్షన్

**వరంగల్ వాయిస్, క్రైం :** వివిధ కారణాలతో భర్తతో విడిపోయిన మహిళ తన కూతురుతో కలిసి వేరే నివాసం ఉంటుండగా వీరిపై కన్నేసిన కామాంధుడు తల్లితో వివాహేతర సంబంధం పెట్టుకొనడంతోపాటు బాలికపై కూడా పలుమార్లు అత్యాచారం చేయడంతో గర్భం దాల్చిన సంఘటనతో సభ్య సమాజం సిగ్గుపడుతోంది. వివరాల్లోకి వెలితే.. మహబూబాబాద్ జిల్లా నర్సింహులపేట మండలంలోని ఓ గ్రామానికి చెందిన దంపతులు విభేదాలతో కొన్నాళ్లుగా వేర్వేరుగా ఉంటున్నారు. భార్య తన కూతురితో కలిసి భువనగిరి జిల్లా ఘట్కేసర్ ప్రాంతంలో నివాసముంటోంది. ఈ క్రమంలోనే ఆమెకు మరిది వరుసయ్యే రాము అనే వ్యక్తితో పరిచయం ఏర్పడి వివాహేతర సంబంధానికి దారితీసింది. తల్లిని వలలో వేసుకున్న దుర్మార్గుడు ఈడుకొచ్చిన కూతురుపైనా కన్నేశాడు. వావి వరుసలు మరిచి ప్రవర్తించాడు. తన సుఖం కోసం సొంత కూతురి జీవితాన్ని పణంగా పెట్టింది. తల్లి ప్రొద్బలంతో కూతురు వరుసయ్యే బాలిక (16)పై పలుమార్లు అత్యాచారం చేయడంతో గర్భం దాల్చింది. తల్లి అండదండలతో తనపై అత్యాచారం జరుగడంతో బాలిక కుమిలి కుమిలి ఏడ్చింది. ఈ విషయం ఎవరికి చెప్పుకోవాలో తెలియక సదరు బాలిక కొద్దిరోజుల క్రితం అమ్మమ్మకు తెలిపింది. దీంతో అందరూ కలిసి విషయం బయటికి పోతే పరువు పోతుందని భావించి గుట్టు చప్పుడు కాకుండా తొర్రూరులోని అమ్మ ప్రైవేటు ఆస్పత్రిలో బాలికకు శనివారం అబార్షన్ చేయించారు.

### కేసు నమోదు..

బాలికకు అబార్షన్ జరిగిన విషయం చైల్డ్ లైన్ కు ఫిర్యాదులు అందడంతో అధికారులు, తొర్రూరు పోలీసులు రంగంలోకి దిగి విచారణ చేపట్టారు. విచారణలో తల్లి, ఆమె ప్రియుడి దారుణాలు వెలుగులోకి వచ్చినట్లు సమాచారం. దీంతో అబార్షన్ నిర్వహించిన ఆస్పత్రి యాజమాన్యంపై, బాలికపై పలుమార్లు అత్యాచారానికి ఒడిగట్టిన రాము, అందుకు సహకరించిన బాలిక తల్లిపై అత్యాచారం, పోక్సో కేసులను నమోదు చేశారు. వారిని అదుపులోకి తీసుకొని విచారిస్తున్నారు. బాలికను ఆస్పత్రికి తరలించి వైద్యం అందిస్తున్నారు.




# ఆల్కాహాల్ పై అవగాహన

**వరంగల్ వాయిస్, కరీమాబాద్ :** మానవత స్వచ్ఛంద సంస్థ, మై చాయిస్ ఫౌండేషన్ సంయుక్త అధ్వర్యంలో శనివారం ఉదయం కరీమాబాద్ లక్ష్మీనగర్ లో ఆల్కాహాలుపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఎన్జీఓ లక్క శ్రీకాంత్ హాజరై మాట్లాడుతూ ఆల్కాహాలు తాగడం వల్ల ఎన్నో అనర్థాలు జరుగుతాయన్నారు. కుటుంబంలో ఘర్షనలు, పంచాయితీలు జరుగుతాయన్నారు. మై చాయిస్ ఫౌండేషన్ కో–ఆర్డినేటర్ గుజ్జర్ రీనా మాట్లాడుతూ గృహహింసతో జరిగే నష్టాలను చక్కగా వివరించారు. మానవత స్వచ్ఛంద సంస్థ అధ్యక్షులు గోగికార్ రవిందర్ మాట్లాడుతూ సామాజంలో ఆల్కాహాలు ప్రభావంతో కుటుంబాలు ఎన్నో ఇబంధులు పడుతున్నాయన్నారు. ఈ కార్యక్రమంలో ప్రోగ్రాం కౌన్సిలర్ ఎంఎస్. రత్న శ్రీ, పోగ్రాం అసిస్టెంట్ కోఆర్డినేటర్లు కలకోట్ల చిరంజీవి, మౌనిక, పిస్ మెకర్లు రవీందర్, అనిల్, రాగి విజయ్, స్థానికులు పడాల కృష్ణమూర్తి, పిట్టా రాజేంద్ర ప్రసాద్, బ్రహ్మాచారి, సాంబయ్య, సమ్మయ్య, అయిలయ్య, యాకయ్య, శివ రాజు, సాంబశివుడు, యాదగిరి, సతీష్ పాల్గున్నారు.

# పర్యాటకానికి పెద్దపీట

- కుడా చైర్మన్ ఇనగాల
- కలెక్టర్, కమిషనర్ లతో కలిసి ఖిలా వరంగల్ పర్యటన



**వరంగల్ వాయిస్, కాశిబుగ్గ :** వరంగల్ కోటను పర్యాటక ప్రాంతంగా అభివృద్ధి చేస్తామని కుడా చైర్మన్ ఇనగాల వెంకట్రామ్ రెడ్డి అన్నారు. శనివారం వరంగల్ కలెక్టర్ సత్య శారద దేవి, బల్దియా కమిషనర్ అశ్విని తానాజీ వాకడేతో కలిసి వరంగల్ కోటతో మొగిలిచెర్ల గ్రామాన్ని సందర్శించారు. వారసత్వ పర్యాటక, సాంస్కృతిక ప్రదేశంగా అభివృద్ధి చేయడానికి అవసరమైన చర్యలకు ప్రణాళిక రూపొందించి పనులను వేగవంతం చేయాలని సంబందిత శాఖల అధికారులను ఆదేశించారు. కోట లోని శృంగారపు భావి, ఖుష్ మహాల్ పరిసరాలను, గుండు చెరువు చుట్టూ నిర్మిస్తున్న బండ్ ప్రదేశాన్ని, ఏకశిలా పార్క్, మరుగున పడిన కాటేజీలకు మరమ్మత్తులు, కాకతీయుల వారసత్వమైన దేవాలయాలు ఇతర ప్రదేశాల అభివృద్ధి, పెండింగ్‌లో ఉన్న పనులను పూర్తి చేసే దిశగా కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్కియాలజీ, పర్యటకరంగం అధికారులు, వరంగల్ ఆర్డీవో, కుడా పీవో అజిత్ రెడ్డి, ఈఈ భీమ్ రావు, సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

# పంట వేయమన్నారు.. ఆపై మొఖం చాటేశారు

■ మొక్క జొన్న రైతు ఆవేదన



**వరంగల్ వాయిస్, మల్హర్ :** భూపాలపల్లి జిల్లా మల్హర్ మండల కేంద్రం తాడిచెర్ల గ్రామానికి చెందిన అర్ని ప్రసాద్ అనే రైతు విన్ క్రాప్ సీడ్ మొక్కజొన్న మేల్, ఫిమేల్ హైబ్రిడ్ పంటను వేశాడు. పంట చేతికొచ్చింది కానీ కంపెనీ నిర్వాహకులు తీసుకోకపోవడంతో బాధిత రైతు విలవిలలాడుతున్నాడు. కంపెనీ నిర్వాహకులు ఆర్ని ప్రసాద్ తో ఒప్పందం కుదిరించుకొని మొక్కజొన్న పంట వేయించారు. అయితే పంట చేతికి వచ్చిన సీడ్ కంపెనీ నిర్వాహకులు తీసుకోకపోవడం, చేనులో నిల్వ ఉండడంతో ఆవులు, అడవి పందులు, కోతులు, చిలుకల బెడద తీవ్రం కావడం వల్ల కాపలా ఉండలేక నానా తంటాలు పడుతున్నాడు. కంపెనీ నిర్వాహకులకు ఎన్నోసార్లు సమాచారం ఇచ్చినా ఇటువైపు రావడం లేదని, ఫోన్ చేసినా స్పందించడం లేదని బాధితుడు తెలిపారు. దీంతో విసుగు చెందిన రైతు కొయ్యూర్ పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు తెలిపాడు. రైతు తెలిపిన వివరాల ప్రకారం తనకున్న మూడున్నర ఎకరాల్లో వెన్ క్రాప్ సీడ్ మొక్కజొన్న పంటను వేశాడు. పంట వేసిన తరువాత కంపెనీ ప్రతినిధులు 4 నెలల తర్వాత వచ్చి కొనుగోలు చేసుకుని తీసుకెళ్తామని ఒప్పందం కుదుర్చుకొని ఐదు నెలలు కావస్తున్నా ఇప్పటికీ రాలేదని ఆవేదన వ్యక్తం చేశాడు. ఇప్పటికే ఎకరానికి రూ. 50 వేలు ఖర్చు వచ్చిందని, పంటను తీసుకొని వెళ్లకపోతే తాను తీవ్రంగా నష్టపోతానని రైతు ఆందోళన వ్యక్తం చేశాడు. ఈ విషయంపై స్థానిక వ్యవసాయ అధికారులకు కూడా సమాచారం ఇచ్చినట్లు తెలిపాడు. ఎవరూ స్పందించకపోవడంతో చివరకు పోలీస్ స్టేషన్ లో ఫిర్యాదు చేశానని, తనకు న్యాయం చేయాలని రైతు వేడుకుంటున్నాడు.



# ఎల్ ఆర్ ఎస్ సువర్ణావకాశం

◆ ప్రజలు సద్వినియోగం చేసుకోవాలి

◆ మేయర్ గుండు సుధారాణి

**వరంగల్ వాయిస్, బల్దియా :** ప్రభుత్వం కల్పించిన ప్లాట్లు, లేఔట్ల క్రమబద్ధీకరణ (ఎల్ఆర్ఎస్) అవకాశాన్ని నగర ప్రజలు సమర్థవంతంగా వినియోగించుకోవాలని గ్రేటర్ వరంగల్ మేయర్ గుండు సుధారాణి సూచించారు. శనివారం బల్దియా ప్రధాన కార్యాలయంలో జరిగిన సమీక్ష సమావేశంలో, ఎల్ఆర్ఎస్ దరఖాస్తుల పురోగతి, నాన్-కమర్షియల్ భవనాలను కమర్షియల్ గా ఉపయోగించడంపై చర్యలు, నాలాల విస్తరణ, ఆక్రమణల తొలగింపు వంటి అంశాలపై మేయర్ పట్టణ ప్రణాళిక అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, 2020 ఆగస్టు 26 వరకు రిజిస్ట్రేషన్ చేయబడిన ప్లాట్లు, నాన్-లేఔట్ భూములకు ఈ నెల 31వ తేదీలోపు ఎల్ఆర్ఎస్ ఫీజు చెల్లింపుపై 25 శాతం రాయితీ లభిస్తుందని తెలిపారు. అర్హులైన ప్రతి ఒక్కరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. సేల్ డీడ్ రిజిస్ట్రేషన్ కలిగిన ప్లాట్లకూ ఇదే సదుపాయం వర్తిస్తుందని వివరించారు. నగర ప్రజలు ఎల్ఆర్ఎస్ సంబంధిత విషయాలపై కార్యాలయాల చుట్టూ తిరగకుండా జీడబ్ల్యూ ఎంసీ పరిధిలో ఏర్పాటు చేసిన 10 హెల్ప్ డెస్కులను సంప్రదించి సందేహాలను నివృత్తి చేసుకోవాలని మేయర్ తెలిపారు. మిగిలి ఉన్న ఎనిమిది రోజుల్లో విస్తృత ప్రచారం నిర్వహించి ప్రజల్లో చైతన్యం కల్పించాలని ఆదేశించారు. ఎల్ఆర్ఎస్ పురోగతి జీడబ్ల్యూఎంసీ పరిధిలో 1 లక్ష ఎల్ఆర్ఎస్ దరఖాస్తులు వచ్చినట్లు తెలియజేశారు. ఇందులో 68,000 దరఖాస్తులు ఆమోదించబడ్డాయని, 3,000 మంది ఫీజు చెల్లించారని, 1,200 మంది క్రమబద్ధీకరణ ప్రొసీడింగ్స్ అందుకున్నారని వివరించారు. నగరంలో గృహ వినియోగానికి అనుమతి పొంది, కమర్షియల్ గా ఉపయోగిస్తున్న భవనాలను గుర్తించి వాటి పన్నును రివైజ్ చేయాలని మేయర్ అధికారులను ఆదేశించారు. అలాగే, ఖాళీ స్థలాలపై పన్ను విధించడం ద్వారా ఆదాయాన్ని పెంచే చర్యలు చేపట్టాలని సూచించారు. వచ్చే వర్షాకాలంలో నగర ముంపు నివారణలో భాగంగా, హన్మకొండ, వరంగల్ జిల్లా కలెక్టర్ ఆధ్వర్యంలో ఇరిగేషన్, టౌన్ ప్లానింగ్, రెవెన్యూ, ఇంజనీరింగ్ శాఖల ఎన్ఫోర్స్‌మెంట్ బృందాలు ఏప్రిల్ 15 నుంచి ప్రధాన నాలాల విస్తరణ, ఆక్రమణల తొలగింపు చర్యలు చేపట్టాలని మేయర్ ఆదేశించారు. ఈ సమావేశంలో బల్దియా సిటీ ప్లానర్ రవీందర్ రాడేకర్, ఏసీపీలు శ్రీనివాస్ రెడ్డి, ఖలీల్, నశ్రీన్ బానో, ఇంచార్జి ఇర్షాద్, రజిత, టీపీఎస్‌లు తదితరులు పాల్గొన్నారు.

# రక్తదాన శిబిరం విజయవంతం

**వరంగల్ వాయిస్, పరకాల :** స్వాతంత్ర్య సమరయోధులు షహీద్ భగత్ సింగ్, రాజ్ గురు, సుఖ్ దేవ్ ల 94వ వర్ధంతి పురస్కరించుకొని సంవేదన-2లో భాగంగా నేషనల్ ఇంటిగ్రేటెడ్ ఫోరం ఆఫ్ ఆర్టిస్ట్స్ ఆక్టివిటీస్ (నిఫా), యువ నేతాజీ ఫౌండేషన్ వరంగల్ వారి ఆధ్వర్యంలో శనివారం పరకాల క గవర్నమెంట్ హాస్పిటల్ లో రక్తదాన శిబిరాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథులుగా హాజరైన పరకాల గవర్నమెంట్ హాస్పటల్ సూపరింటెండెంట్ డాక్టర్ గౌతం చౌహాన్, నిఫా తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు కే.యాదవ రాజు, సామాజిక వేత్త టీ.వి అశోక్ కుమార్ మాట్లాడుతూ బ్రిటిష్ పాలన నుంచి దేశాన్ని రక్షించేందుకు ఎన్నో త్యాగాలు చేసిన మహానుభావులను నేటి యువత ఆదర్శంగా తీసుకోవాలన్నారు. దేశ సమైక్యత సంస్కృతిక సాంప్రదాయాలను కాపాడేందుకు ప్రతి ఒక్కరు బాధ్యతగా వ్యవహరించాలని సూచించారు. ఈ సందర్భంగా పరకాల గవర్నమెంట్ హాస్పటల్ సూపరింటెండెంట్ డాక్టర్ గౌతం చౌహాన్ బ్లడ్ క్యాంపు ఆర్గనైజ్ చేసిన ఆర్గనైజర్స్ బ్లడ్ డోనర్ అండ్ బ్లడ్ మోటివేటర్, వరంగల్ పోలీస్ కానిస్టేబుల్ కన్నె రాజు ( స్విమ్మర్ రాజు ), కొత్తకొండ అరుణ్ కుమార్, ఎస్.కె ముస్తఫా ను ప్రత్యేకంగా అభినందించారు. ఈ కార్యక్రమంలో స్వచ్ఛందంగా 35 మంది రక్తదానం చేయడం జరిగింది. రక్తదానం చేసి ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేసిన ప్రతి ఒక్కరికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో పరకాల గవర్నమెంట్ హాస్పటల్ సూపరింటెండెంట్ డాక్టర్ గౌతం చౌహాన్, నిఫా తెలంగాణ రాష్ట్ర అధ్యక్షులు కే.యాదవ రాజు, సామాజిక వేత్త టీ.వి అశోక్ కుమార్, బ్లడ్ బ్యాంక్ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ బాలకృష్ణ, యువ నేతాజీ ఫౌండేషన్ వరంగల్ అధ్యక్షుడు కొత్తకొండ అరుణ్



కుమార్, వరంగల్ పోలీస్ కానిస్టేబుల్ కన్నె రాజు (స్విమ్మర్ రాజు), కానిస్టేబుల్ బొట్టు కమలాకర్, విజయ, చంద్రరావు, సాధు ప్రసాద్, కునూరు గణేష్, బండి ప్రశాంత్, ఆనంద్, నరేష్, రాజేష్, రమేష్, సాంబరాజు, సంతోష్, శ్రీకాంత్, ఆనంద్, రాకేష్, వినయ్ కుమార్, రాజేష్, రంజిత్, రాజు, అనిల్, నాగరాజు, సాధు రోహిత్, అమర్నాథ్, సంతోష్, మధుకర్, సంజయ్ కుమార్, శివ సాయి, మడి కొండ సదానందం, మడి కొండ షిండే, ప్రవీణ్, రంజిత్, బండి శ్రీధర్, అన్వేష్, కోలా రాజేష్, ప్రభుత్వ ఉపాధ్యాయుడు గజ్జెల సుమన్, అలువల పృథ్వీ, ఉప్పరపల్లి రాజ్ కుమార్, మునిగాల రాంప్రసాద్, ఊరటి రవికుమార్, సృజన, జ్యోతి, భావన, బిటుకూరి యాకయ్య, పాలకుర్తి విష్ణు, ఎస్.కె ముస్తఫా, లీగల్ అడ్వైజర్ రాచకట్ల కృష్ణ (హైకోర్ట్ అడ్వకేట్), యాద రవి కుమార్, చెలిమల్ల అశోక్ కుమార్, తూనం రాము, సి.ఐ.ఎస్.ఎఫ్ కానిస్టేబుల్ వైనాల రమేష్, మండల భూపాల్, బ్లడ్ బ్యాంక్ సిబ్బంది రోజా, ప్రమీల, ప్రశాంత్, సుమలత, రమేష్ విష్ణు, రక్తదాతలు పాల్గొన్నారు.

# అన్నారం తైబజార్ వేలం ఖరారు



**వరంగల్ వాయిస్, పర్వతగిరి :** మండలంలోని అన్నారం షరీఫ్ తైబజార్ వేలం 2025-2026 ఆర్థిక సంవత్సరానికి రూ.37,65000 కు షేక్ సమ్రిన్ సలేహా దక్కించుకున్నట్లు ప్రత్యేక అధికారి ఎంపీవో పాకా శ్రీనివాస్ తెలిపారు. వేలం కార్యక్రమంలో స్థానిక తహశీల్దార్ వెంకటస్వామి, కార్యదర్శి మోహినోద్దీన్, సిబ్బంది యాకయ్య, ఇతరులు పాల్గొన్నారు.

# బ్రహ్మోత్సవాలకు విరాళాలు అందజేత

**వరంగల్ వాయిస్, గణపురం :** మండల కేంద్రంలోని పట్టాభి సీతా రామచంద్ర స్వామి దేవాలయంలో శ్రీరామనవమి బ్రహ్మోత్సవాలకు గణపురానికి చెందిన మోటపోతుల శివ శంకర్ గౌడ్ 50 కేజీల బియ్యాన్ని, లత జ్యూవెలరీ నిర్వాహకులు, అదేవిధంగా మూర్తి సన్స్ జ్యూవెలరీ నిర్వాహకులు, సీతారామ ట్రాన్స్ పోర్ట్ నిర్వాహకులు, భవాని హోమ్ నీడ్స్ నిర్వాహకులు, సోమేశ్వర మెడికల్ స్టోర్ నిర్వాహకులు, రామాలయంలో నిర్వహించే బ్రహ్మోత్సవాలకి బియ్యాన్ని రామాలయ కమిటీ అధ్యక్షులు తాళ్లపల్లి గోవర్ధన్ కుఅందజేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

# పర్వతగిరి రిజర్వాయర్ పై అసెంబ్లీలో చర్చ

నాసిరకం పనులపై విచారణ చేయాలన్న ఎమ్మెల్యే



**వరంగల్ వాయిస్, పర్వతగిరి :** పర్వతగిరి రిజర్వాయర్ సమస్యపై స్థానిక వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు అసెంబ్లీలో చర్చించారు. దశాబ్ద కాలంగా గత బీఆర్ఎస్ ప్రభుత్వ చర్యల పర్యవసానాలతో ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం ఎలా వ్యవహరిస్తోందనే విషయంపై మాట్లాడారు. పర్వతగిరి మండల కేంద్రంలోని పెద్ద చెరువును రిజర్వాయర్‌గా మార్చారని, అయితే ఆ ప్రాజెక్టు నిర్మాణం నాసిరకంగా నిర్మించి రూ.80 లక్షలు బిల్లు తీసుకున్నారని తెలిపారు. ఈ విషయం ఇంకా విచారణలో ఉందన్నారు. ఈ రిజర్వాయర్ కింద దాదాపు 2500 నుంచి 3000 ఎకరాల ఆయకట్టు భూములు వరి సాగుకు వినియోగిస్తున్నారు. పదేళ్లుగా ఈ సమస్యను గుర్తించడంలో గత ప్రభుత్వం విఫలమైందని, ఫలితంగా భూమి అన్యాక్రాంతమైందని ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు ఉద్ఘాటించారు. ప్రభుత్వం వెంటనే స్పందించి విచారణను ముమ్మరం చేసి రిజర్వాయర్‌ను కాపాడుతూ రైతులకు న్యాయం చేయాలని కోరారు.

# శ్రీ వేద స్కూల్లో స్వయం పరిపాలన దినోత్సవం



**వరంగల్ వాయిస్, శాయంపేట :** మండలంలోని పెద్దకొడపాక లోని శ్రీ వేద పాఠశాలలో శనివారం రోజున స్వయం పరిపాలన దినోత్సవం పాఠశాల ప్రధానోపాధ్యాయులు విజయ్ ఆధ్వర్యంలో నిర్వహించగా విద్యార్థులు ఉపాధ్యాయులుగా మారి తరగతి గదులలో విద్యాబోధన చేశారు. అనంతరం ఉపాధ్యాయులుగా ఉన్న విద్యార్థులు సమావేశంలో మాట్లాడుతూ ఉపాధ్యాయ వృత్తి అనేది సమాజంలో విలువలతో కూడుకొని ఉన్నదని, ఉన్నత మైనదన్నారు. ఈ స్వయం పరిపాలన దినోత్సవంలో ప్రధానోపాధ్యాయులుగా కొయ్యడ శివ, డీఈవోగా అయాన్, డిప్యూటీ డీఈఓగా హర్షిని, ఎంఈఓగా హరిణి, ఉపాధ్యాయులుగా శ్రీ సాక్షిత్, కార్తీక్, హిమశ్రీ, మేఘన, హార్దిక్ కుమార్, అవంతిక, వర్షిత్ తదితరులు వ్యవహరించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు వేద, ప్రియాంక, కీర్తి రెడ్డి పాల్గొన్నారు.

# సంకీర్ణ ప్రభుత్వాలతోనే సుస్థిరమైన పాలన సాధ్యం

## కేయూ వీసీ కె.ప్రతాపరెడ్డి



**వరంగల్ వాయిస్, కేయూ:** ప్రజాస్వామ్య పరిరక్షణలో సంకీర్ణ ప్రభుత్వాల పాత్ర కీలకమని, అవి సమాజ సమిష్టి ప్రయోజనాలను కాపాడడంలో సహాయపడతాయని కాకతీయ యూనివర్సిటీ వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ కె. ప్రతాపరెడ్డి తెలిపారు. శనివారం కాకతీయ యూనివర్సిటీ సెనేట్ హాల్‌లో రాజనీతి శాస్త్ర విభాగం ఆధ్వర్యంలో నిర్వహించిన "భారత సమాజంలో సంకీర్ణ ప్రభుత్వాలు మరియు ప్రజాస్వామ్యం" అనే జాతీయ సెమినార్ ముగింపు సమావేశం రాజనీతి శాస్త్ర విభాగాధిపతి ప్రొఫెసర్ సంకినేని వెంకటయ్య అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా ముఖ్య అతిథిగా ప్రసంగించిన ప్రొఫెసర్ కె. ప్రతాపరెడ్డి, ప్రస్తుత రాజకీయ పరిస్థితులను శాస్త్రీయ దృక్పథంతో విశ్లేషించే బాధ్యత రాజనీతి శాస్త్ర విభాగంపై ఉందని పేర్కొన్నారు. సంకీర్ణ ప్రభుత్వాలు బహుళ వర్గాల ఐక్యతకు ప్రతీకగా మారడంతో పాటు, ప్రజాస్వామ్య ధోరణిని బలోపేతం చేస్తాయని వివరించారు. జాతీయ సెమినార్ ముగింపు కార్యక్రమంలో ఓసియు సోషల్ సైన్స్ మాజీ డీన్, రిటైర్డ్ ప్రొఫెసర్ కే. శ్రీనివాసులు కీలక ప్రసంగం చేస్తూ, ఏకపార్టీ పాలనలో అధికారం కేంద్రీకృతమవుతుందని, కానీ సంకీర్ణ ప్రభుత్వాలలో అధికార వికేంద్రీకరణ వల్ల ప్రజాస్వామ్య స్థాయిలో సమతుల్యత నెలకొంటుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రత్యేక అతిథులుగా కేయూ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ వి. రామచంద్రం, కేయూ యూజీసీ కోఆర్డినేటర్ ప్రొఫెసర్ పి. మల్లికార్జున రెడ్డి, మద్రాస్ యూనివర్సిటీ ప్రొఫెసర్ సి. లక్ష్మణన్ పాల్గొని ప్రసంగించారు. సెమినార్‌లో వివిధ యూనివర్సిటీల ప్రొఫెసర్లు, రీసెర్చ్ స్కాలర్లు, విద్యార్థులు తమ పరిశోధన పత్రాలను సమర్పించారు. ఈ ముగింపు సమావేశంలో రాజనీతి శాస్త్ర విభాగం బోర్డు ఆఫ్ స్టడీస్ చైర్మన్ డాక్టర్ గడ్డం కృష్ణయ్య, కేయూ రిటైర్డ్ ప్రొఫెసర్ జి. వీరన్న నాయక్, డాక్టర్ హరిప్రసాద్, ఇతర అధ్యాపకులు డాక్టర్ సత్యనారాయణ, డాక్టర్ నాగరాజు, డాక్టర్ లక్ష్మీనారాయణ, డాక్టర్ లలిత కుమారి, డాక్టర్ సంజీవ్, డాక్టర్ విజయ్, డాక్టర్ సునీల్, డాక్టర్ భాగ్యమ్మ పాల్గొన్నారు.

# పది పరీక్షలను పరిశీలించిన డీఈవో



**వరంగల్ వాయిస్, దామెర :** మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో జరుగుతున్న పదో తరగతి పరీక్షలను రెండవ రోజు హనుమకొండ జిల్లా విద్యాశాఖ అధికారి డి.వాసంతి ఆకస్మికంగా తనిఖీ చేయడం జరిగింది. విద్యార్థులు పరీక్షలు రాస్తున్న గదులను తిరిగి పరిశీలించారు. అనంతరం విద్యార్థులకు కల్పిస్తున్న మౌలిక వసతుల గురించి అడిగి తెలుసుకొని సంతృప్తిని వ్యక్తం చేశారు.

# బీఎస్పీ రేగొండ మండల అధ్యక్షుడిగా శ్రీకాంత్



**వరంగల్ వాయిస్, రేగొండ :** బీఎస్పీ రేగొండ మండల అధ్యక్షుడిగా మడ్తపల్లి గ్రామానికి చెందిన ఇంజపల్లి శ్రీకాంత్ ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు బీఎస్పీ భూపాలపల్లి జిల్లా అధ్యక్షులు పొన్నం భిక్షపతి గౌడ్ పేర్కొన్నారు. మండల కేంద్రంలో నియోజకవర్గ ఇంచార్జి వేల్పుల మహేందర్ గౌడ్ ఆధ్వర్యంలో శనివారం నిర్వహించిన ముఖ్య కార్యకర్తల సమావేశం సందర్భంగా భిక్షపతి గౌడ్ ముఖ్య అతిథిగా హాజరై మండల అధ్యక్షుడిని ఎన్నుకున్నారు. అనంతరం మాట్లాడుతూ బలహీన వర్గాలు రాజ్యాధికారం దిశగా అడుగులు వేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో కొయ్యాడ రాజు, మేకల ఓంకార్, స్వామి తదితరులు పాల్గొన్నారు.

# ఉద్యోగ భద్రతకై ఎదురుచూపులు

- కలగానే ఎన్ హెచ్ఎం ఉద్యోగుల క్రమబద్ధీకరణ
- ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని రామ రాజేష్ ఖన్నా డిమాండ్



**వరంగల్ వాయిస్, వరంగల్ :** నేషనల్ హెల్త్ మిషన్ కాంట్రాక్ట్, ఔట్ సోర్సింగ్ ఉద్యోగస్తుల జీవన స్థిరత్వం ఇంకా కలగానే మిగిలిపోయింది. గత 25 సంవత్సరాలుగా ఉద్యోగ భద్రత కోసం ఎదురుచూస్తూ ఉన్న ఈ ఉద్యోగుల సమస్యలు పరిష్కారం కాని పరిస్థితిలో ఉన్నాయి. ఈ అంశంపై ఏఐటీయూసీ రాష్ట్ర కౌన్సిల్ మెంబర్, ఎన్ హెచ్ ఎం కాంట్రాక్ట్ అండ్ ఔట్సోర్సింగ్ ఎంప్లాయిస్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రామ రాజేష్ ఖన్నా మాట్లాడుతూ 2000 సంవత్సరంలో కేంద్రం 60శాతం, రాష్ట్ర ప్రభుత్వం 40శాతం నిధులతో ప్రారంభమైన నేషనల్ హెల్త్ మిషన్ (ఎన్ హెచ్ ఎం) ద్వారా గ్రామీణ, పట్టణ ప్రజలకు వైద్య సేవలు అందించడానికి కాంట్రాక్ట్, ఔట్ సోర్సింగ్ విధానంలో ఉద్యోగులను నియమించారని చెప్పారు. అయితే, వీరు చాలాకాలంగా తక్కువ వేతనాలతో కుటుంబాలను పోషించుకోవడానికి కష్టపడుతున్నారని, ప్రభుత్వాలు వారి స్థిర ఉద్యోగ భద్రతపై దృష్టి పెట్టడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. స్వతంత్ర భారతానికి 76 సంవత్సరాలు పూర్తయ్యినా, ఏ ప్రభుత్వం లేదా ఏ రాజకీయ పార్టీ కూడా కనీస వేతనాల చట్టాన్ని పూర్తిగా అమలు చేయలేకపోయింది. ఎన్ హెచ్ఎం ఉద్యోగులను నిరంతరం కాంట్రాక్ట్ విధానంలో కొనసాగిస్తూ, ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించకపోవడం అన్యాయమని ఆయన వ్యాఖ్యానించారు. ఈ నేపథ్యంలో, ఎన్నికల సమయంలో రాజకీయ పార్టీలు ఉద్యోగుల భద్రత గురించి ఎన్నో హామీలు ఇస్తూనే, అధికారంలోకి వచ్చిన తర్వాత వాటిని అమలు చేయకుండా మరిచిపోతున్నాయని ఆయన ఆరోపించారు. బీఆర్ఎస్ ప్రభుత్వం హయాంలో "కాంట్రాక్ట్ ఉద్యోగం అనే మాట ఉండదని, అందరూ ప్రభుత్వ ఉద్యోగులవుతారని" చెప్పినా, అది అమలు కాలేదని విమర్శించారు. అలాగే, "ఇంటికో ఉద్యోగం, మూడు ఎకరాల భూమి" వంటి హామీలను నెరవేర్చలేదని చెప్పారు. కేంద్రంలో నరేంద్ర మోడీ ప్రభుత్వం గత పదేళ్లలో కార్మిక చట్టాలను రద్దు చేసి, నాలుగు కొత్త కార్మిక నియమాలను ప్రవేశపెట్టింది. ఇవి కార్మికులకు కాకుండా కార్పొరేట్ కంపెనీలకు మేలు చేసేలా ఉన్నాయని రామ రాజేష్ ఖన్నా ఆరోపించారు. మోడీ ప్రభుత్వం వార్షికంగా రెండు కోట్ల ఉద్యోగాల హామీ ఇచ్చినా, ప్రస్తుతం ఉద్యోగ సంక్షోభం పెరిగిపోతున్నదని అన్నారు. కార్మిక హక్కులను రద్దు చేసి, అంబానీ, అదానీ వంటి కార్పొరేట్ కంపెనీలకు మద్దతుగా మారిందని ఆయన మండిపడ్డారు. ఇతర రాష్ట్రాలైన మణిపూర్, పంజాబ్, హర్యానా, హిమాచల్ ప్రదేశ్, మహారాష్ట్ర లలో ఎన్ హెచ్ఎం ఉద్యోగులను రెగ్యులరైజ్ చేశారు. అదే విధంగా, తెలంగాణ రాష్ట్రంలో కూడా కాంట్రాక్ట్, ఔట్ సోర్సింగ్ ఉద్యోగులను రెగ్యులరైజ్ చేసి ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని రామ రాజేష్ ఖన్నా డిమాండ్ చేశారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నేషనల్ హెల్త్ మిషన్ ఉద్యోగులను రెగ్యులరైజ్ చేయడం తప్పనిసరి అంటూ, కార్మిక హక్కులను రద్దు చేయకుండా పునరుద్ధరించాలన్నారు.

# జాతీయ రహదారుల నిర్మాణ పనులను పూర్తి చేయాలి

- జిల్లా కలెక్టర్ ప్రావీణ్య



**వరంగల్ వాయిస్, హనుమకొండ :** సిద్దిపేట–ఎల్కతుర్తి జాతీయ రహదారి 765డీజీ పరిధిలో జిల్లాకు సంబంధించి నిర్మాణంలో ఉన్న రహదారి పనులను త్వరగా పూర్తి చేయాలని సంబంధిత శాఖల అధికారులను హనుమకొండ జిల్లా కలెక్టర్ పి.ప్రావీణ్య ఆదేశించారు. శనివారం హనుమకొండ జిల్లా కలెక్టరేట్ లో సిద్దిపేట–ఎల్కతుర్తి మార్గంలో జాతీయ రహదారి నిర్మాణ పనులపై జాతీయ రహదారుల శాఖ అధికారులతో పాటు సంబంధిత శాఖల అధికారులతో సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా సిద్దిపేట–ఎల్కతుర్తి వరకు 63.64 కిలోమీటర్ల జాతీయ రహదారి నిర్మాణ ప్రాజెక్టు ఉండగా హనుమకొండ జిల్లా పరిధిలో ఉన్న 17.5 కిలోమీటర్ల లో ఇప్పటివరకు 16.5 కిలోమీటర్ల రహదారి నిర్మాణం పూర్తయిందని, జాతీయ రహదారుల శాఖ అధికారులు కలెక్టర్ కు తెలియజేశారు. ఎల్కతుర్తి, ముల్కనూర్ పరిధిలో ఒక్క కిలోమీటర్ దూరం వరకు జాతీయ రహదారి నిర్మాణ పనులు పురోగతిలో ఉన్నాయని అధికారులు వివరించారు. జిల్లా పరిధిలో ఉన్న ఈ జాతీయ రహదారి నిర్మాణ పనులు మొత్తం మే నాటికి పూర్తవుతాయని అధికారులు తెలుపగా ఏప్రిల్ 30 నాటికి పూర్తిచేయాలన్నారు.

# రైతును రాజు చేయడమే ప్రభుత్వ లక్ష్యం

- మార్కెట్ కమిటీ చైర్మన్ చందుపట్ల రాజిరెడ్డి



**వరంగల్ వాయిస్, పరకాల :** రైతును రాజుగా చేయడమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యం అని పరకాల వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ చందుపట్ల రాజిరెడ్డి తెలిపారు.తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం అసెంబ్లీ సమావేశాల్లో వ్యవసాయ రంగానికి అత్యధికంగా రూ.24,439 కోట్ల బడ్జెట్ కేటాయించడంతో పాటు, రైతు భరోసా కోసం రూ.18,000 కోట్ల, పశుసంవర్ధక శాఖకు రూ.1,674 కోట్ల నిధులు కేటాయించడం ప్రశంసనీయమని చందుపట్ల రాజిరెడ్డి అన్నారు. ఈ సందర్భంగా ఆయన ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి, ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్ రావు, పరకాల శాసనసభ్యులు రేవూరి ప్రకాష్ రెడ్డి, భూపాలపల్లి శాసనసభ్యులు గండ్ర సత్యనారాయణ రావులకు కృతజ్ఞతలు తెలియజేశారు. పరకాల వ్యవసాయ మార్కెట్‌లో నిర్వహించిన సమావేశంలో, మార్కెట్ కమిటీ చైర్మన్ చందుపట్ల రాజిరెడ్డి అధ్యక్షతన పాలకవర్గ సభ్యులు బడ్జెట్ కేటాయింపులను హర్షిస్తూ ముఖ్యమంత్రి, మంత్రుల చిత్రపటాలకు పాలాభిషేకం నిర్వహించారు. ఈ సందర్భంగా చైర్మన్ చందుపట్ల రాజిరెడ్డి మాట్లాడుతూ, "వ్యవసాయ రంగానికి భారీ స్థాయిలో బడ్జెట్ కేటాయించడం ప్రభుత్వం తీసుకున్న సాహసోపేతమైన నిర్ణయం. రైతును రాజుగా తీర్చిదిద్దడమే ప్రభుత్వ విధానం" అని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ మారేపల్లి రవీందర్ (బుజ్జన్న), డైరెక్టర్లు బొమ్మకంటి రుద్రమదేవి, నల్లెల్ల కుమారస్వామి, పెండెల కుమారస్వామి, దాసరి బిక్షపతి, బుడిమే రాజయ్య, శానం కుమారస్వామి, వైద్యుల వెంకటరాజు రెడ్డి, భోగం కమల, ఎండి రంజాన్, స్వామి రావు, పరకాల, నడికూడ, శాయంపేట మండలాలకు చెందిన రైతులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# భగత్ సింగ్ వారోత్సవాలను జయప్రదం చేయండి

**➲ పోస్టర్ ఆవిష్కరించిన ప్రజా సంఘాలు**



**వరంగల్ వాయిస్, వరంగల్ :** బ్రిటిష్ సామ్రాజ్యవాదానికి వ్యతిరేకంగా పోరాడి ఉరితాడును ముద్దాడిన యువ కిశోరులు కామ్రేడ్ భగత్ సింగ్, రాజ్ గురు, సుఖదేవ్ ల 94వ వర్ధంతి వారోత్సవాలను జయప్రదం చేయాలని కోరుతూ శనివారం నర్సంపేట పట్టణంలోని న్యూ డెమోక్రసీ పార్టీ కార్యాలయంలో ప్రజా సంఘాల ఆధ్వర్యంలో పోస్టర్ ఆవిష్కరించారు. పీడీఎస్ యూ, పీవైఎల్, సంఘాల రాష్ట్ర కమిటీల ఆధ్వర్యంలో రాష్ట్రవ్యాప్తంగా ఈనెల 23 నుంచి 30దీ వరకు 94వ వర్ధంతి వారోత్సవాలను జరపాలని పిలుపునిచ్చాయని వారు తెలిపారు. ఈ సందర్భంగా ఏఐకేఎంఎస్ రాష్ట్ర కమిటీ సభ్యులు రాచర్ల బాలరాజు, ఐఎఫ్ టీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎలకంటి రాజేందర్లు మాట్లాడుతూ సామ్రాజ్యవాదానికి వ్యతిరేకంగా భారత విద్యార్థి నిరుద్యోగులపై అమెరికా అధ్యక్షుడు ట్రంప్ అనుసరిస్తున్న దురాహంకారానికి వ్యతిరేకంగా పోరాడాలన్నారు. అలాగే కేంద్రంలోని మోడీ ప్రభుత్వం తీసుకువచ్చిన ఎన్ఈపీ 20-20, యూజీసీ ముసాయిదాలను రద్దు కోసం హైదరాబాద్ ఉస్మానియా యూనివర్సిటీలో వైస్ ఛాన్స్ లర్ విద్యార్థి సంఘాలు చేసే ఆందోళన ఇతర కార్యక్రమాలపై నిషేధం ఎత్తివేతకు పోరాడాలని వారు కోరారు. నేడు దేశంలో రోజురోజుకు పెరుగుతున్న బీజేపీ మతోన్మాద ఫాసిస్టు విధానాలకు వ్యతిరేకంగా విద్యార్థి లోకం ఉద్యమించాలని వారు పిలుపునిచ్చారు. ఈ పోస్టర్ ఆవిష్కరణ కార్యక్రమంలో పీడీఎస్ యూ జిల్లా అధ్యక్షుడు గుర్రం అజయ్, ఏఐకేఎంఎస్ రాష్ట్ర కమిటీ సభ్యులు గట్టి కృష్ణ, ఏఐకేఎంఎస్ జిల్లా నాయకులు భోగి సారంగపాణి, ప్రగతిశీల మహిళా సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి సిలివేరు పూలక్క, గుగులోతు భద్రాజి, భీమగాని మల్లయ్య, బరిగల కుమార్, గొర్రె ప్రదీప్, ఐలయ్య తదితరులు పాల్గొన్నారు.

# కేంద్ర ప్రభుత్వంపై ఉద్యమించండి




**• తాటిపాముల వెంకట్రాములు**

**వరంగల్ వాయిస్, వరంగల్ :** కేంద్రంలో ఉన్న బీజేపీ ప్రభుత్వం గ్రామీణ ప్రాంత వ్యవసాయ కూలీల సమస్యల పట్ల పూర్తిగా నిర్లక్ష్యం వహిస్తున్నదని బీకేఎంయూ జాతీయ కార్యవర్గ సభ్యుడు తాటిపాముల వెంకట్రాములు మండిపడ్డారు. స్వాతంత్రం వచ్చిన 77 ఏళ్ల తర్వాత కూడా ఉండడానికి ఇండ్లు, బ్రతుకుదెరువుకు భూమి లేని పేదలు కోట్లాది మంది ఉన్నారని, ఇది అత్యంత ఘోరమైన విషయమన్నారు. దీన్ని దృష్టిలో ఉంచుకొని పేదరికం రూపుమాపాల్సిన కేంద్ర ప్రభుత్వం రోజురోజుకు గ్రామీణ పేదలకు బడ్జెట్ కేటాయింపుల్ని తగ్గించడమే కాకుండా అంతో ఇంతో ఉపయోగపడుతున్న జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం ను నిర్వీర్యం చేస్తున్నదని ఆయన పేర్కొన్నారు. హనుమకొండ బాలసముద్రంలో గల తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యాలయంలో శనివారం మునిగాల భిక్షపతి అధ్యక్షతన జరిగిన సంఘం జిల్లా కమిటీ సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఇంకా ఆయన మాట్లాడుతూ ధనవంతులకు ముఖ్యంగా కార్పొరేట్లకు అనేక రాయితీలు ఇవ్వడమే కాకుండా వాళ్లకు బ్యాంకులు ఇచ్చిన లక్షల కోట్ల రుణాలను సైతం ఒకపక్క మాఫీ చేస్తూ ప్రభుత్వం పేదల పట్ల అత్యంత కఠినంగా వ్యవహరిస్తున్నదని విమర్శించారు. అనేక దశాబ్దాల పోరాట ఫలితంగా సాధించుకున్న కొద్దో గొప్పో హక్కులను కేంద్రం కాలరాసే ప్రయత్నం చేస్తే అనుభవం ఉన్న కార్మిక వర్గం పదునైన పోరాటాలు చేసి ప్రభుత్వం మెడలు వంచక తప్పదని హెచ్చరించారు. రాష్ట్ర ప్రభుత్వం ఇందిరమ్మ ఆత్మీయ భరోసా పథకానికి పెద్ద మొత్తంలో నిదులు కేటాయించి భూమిలేని వ్యవసాయకులకు సంవత్సరానికి రూ.12,000 పథకాన్ని సక్రమంగా మన పరచాలన్నారు. రాష్ట్రంలోని గుడిసె వాసులందరికీ పట్టాలు ఇవ్వాలని, వారికి పక్కా గృహాలు నిర్మించాలని డిమాండ్ చేశారు. గ్రామీణ ప్రాంత పేదల సమస్యల పరిష్కారానికి వచ్చే నెల నుంచి క్రమ పద్ధతిలో పోరాటాలకు సంఘము రూపకల్పన చేసిందని, అట్టి పోరాటాల్లో వ్యవసాయ కూలీలు పెద్ద ఎత్తున సమీకరించబడాలని, అందుకు జిల్లా కమిటీ సభ్యులు కృషి చేయాలని ఈ సందర్భంగా వెంకట్రాములు పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో పార్టీ జిల్లా సహాయ కార్యదర్శి మద్దెల ఎల్లేష్, సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి కర్రె లక్ష్మణ్, జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ ఏదునూరి వెంకటరాజం, సహాయ కార్యదర్శి బొట్టు భిక్షపతి, నాయకులు గోకల రాజయ్య, పసునూరి సునీల్, కొట్టెపాక రవి, జూపాక రవి తదితరులతో పాటు జిల్లాలోని వివిధ మండలాల నాయకులు పాల్గొన్నారు.

# రేపటి నుంచి శ్రీ వేణుగోపాల స్వామి బ్రహ్మోత్సవాలు



**వరంగల్ వాయిస్, మట్టేవాడ:** ప్రతీ సంవత్సరం లాగే, ఈ సంవత్సరం కూడా శ్రీ వేణుగోపాల స్వామి వారి బ్రహ్మోత్సవాలు అంగరంగ వైభవంగా నిర్వహించనున్నారు. ఈ ఉత్సవాలు రేపటి నుంచి మార్చి 28వ వరకు జరగనున్నాయి. వరంగల్ పట్టణ ప్రజలందరూ ఈ వేడుకలకు హాజరై స్వామివారి కృపకు పాత్రులు కావాలని దేవస్థానం కమిటీ అధ్యక్షుడు ఇరుకుల్ల రమేష్ కోరారు. భక్తుల సౌకర్యార్థం అన్ని ఏర్పాట్లు పూర్తయ్యాయని, చలువ పందిర్లు, తాగునీటి సౌకర్యం అందుబాటులో ఉంచినట్టు తెలిపారు. మార్చి 23న ఉదయం అభిషేకం, సాయంత్రం జ్యోతి ప్రజ్వలన, దీక్షా స్వీకరణ, రక్షాబంధనం, అంకురార్పణ, శేష వాహన సేవలు ఉంటాయని, మార్చి 24న ఉదయం యాగశాల ప్రవేశం, సంతాన వేణుగోపాల స్వామి ఇష్టి, ధ్వజారోహణం, గరుడ వాహన సేవ. సాయంత్రం కళాధర కూచిపూడి నృత్య ప్రదర్శన, మార్చి 25న సుదర్శన నారసింహ ఇష్టి, సాయంత్రం అశ్వ వాహనం, హంస వాహనంపై స్వామివారి ఎదుర్కోల మహోత్సవం, మార్చి 26న ధన్వంతరి ఇష్టి, సూర్యప్రభ వాహన సేవ. మధ్యాహ్నం 1 గంటకు మహా అన్నదాన ప్రసాద విఘటన. సాయంత్రం రుక్మిణి సత్యభామ సమేత శ్రీ వేణుగోపాల స్వామి వారి తిరు కళ్యాణ మహోత్సవం, మార్చి 27న మహిళా భక్త బృందం చే అమ్మవారికి సారె సమర్పణ, సాయంత్రం 6 గంటలకు వరంగల్ పుర వీధుల్లో కోలాటాలు, డప్పు వాయిద్యాలతో రథోత్సవం, మార్చి 28న ఉదయం లక్ష్మీ హయగ్రీవ ఇష్టి, శ్రీచక్ర స్నానం. సాయంత్రం పుష్పయాగం, వేద ఆశీర్వచనం, రుత్వికుల సన్మానం తో ఉత్సవ సమాప్తి నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ బ్రహ్మోత్సవాల్లో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామివారి అనుగ్రహం పొందాలని దేవస్థానం ఈఓ మిట్టపల్లి భాస్కర్, అధ్యక్షులు ఇరుకుల్ల రమేష్ తెలిపారు. ఈ కార్యక్రమంలో కొత్త వెంకటకృష్ణ, పబ్బ విశ్వప్రసాద్, తోట నవీన్ కుమార్, బెజగం రజినీకాంత్, పాలరపు పనేష్, దివ్వెల నాగరాజు, శ్రీనివాస్, నీల రాజన్న, పబ్బ కిషోర్ కుమార్, ఆకుల సర్వేశ్వర్ రావు, పసునూరి శ్రీనివాస్, నగబోతు రమేష్, మహిళా భక్త బృందం సభ్యులు మాధవి, లక్ష్మీకాంత, శిరీష, అనేక మంది భక్తులు పాల్గొన్నారు. దేవాలయ అర్చకులు ఆరుట్ల రామాచార్యులు, కృష్ణమాచార్యులు గారు పూజా కార్యక్రమాలను నిర్వహించనున్నారు.

## ఎల్లమ్మ దేవాలయ పరిశీలన



**వరంగల్ వాయిస్, మొగిలిచెర్ల :** మరోసారి శ్రీశ్రీశ్రీ ఏకవీరా దేవి ఎల్లమ్మ దేవాలయాన్ని శనివారం జిల్లా కలెక్టర్ సత్య శారద, కుడా చైర్మన్ ఎనగాల వెంకటరామిరెడ్డి, జీడబ్ల్యూఎంసీ కార్పొరేషన్ కమిషనర్ తానాజీ వాకడే పరిశీలించారు. వారి వెంట ఆర్డీవో, గీసుగొండ తహసీల్దార్ రియాజుద్దీన్, పురావస్తు శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ మల్లు నాయక్, పర్యాటకశాఖ జిల్లా అధికారి శివాజీ, టార్చ్ సంస్థ కార్యదర్శి అరవింద్ ఆర్య, రెవెన్యూ సిబ్బంది, కాంగ్రెస్ నాయకులు కొండేటి కొమరారెడ్డి, బీజేపీ నేతలు ఆడెపు రమేష్, బెజ్జాల కుమారస్వామి, రాధారపు శివకుమార్, కర్రు కుమారస్వామి, బిల్లా రమేష్, కొత్తపెల్లి కుమారస్వామి, జీపు పోత రాజు, చేరాలు, రాధారపు మల్లికార్జున్, పుచ్చ భిక్షపతి, లెంకలపల్లి స్వామి, కల్వచర్ల తిరుమల చారి, పత్తిపాక తిరుపతి, మొగిలిచర్లలోని శ్రీశ్రీశ్రీ ఏకవీర దేవి ఎల్లమ్మ దేవాలయాన్ని సందర్శించారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్, పార్టీలకతీతంగా గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

## బాధిత కుటుంబానికి పరామర్శ



**వరంగల్ వాయిస్, తొర్రూరు :** మండలంలోని హరిపిరాల గ్రామానికి చెందిన కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు సుంచు సంతోష్ తండ్రి సుంచు రాములు (80) అనారోగ్యంతో మృతి చెందగా మాజీ జడ్పీటీసీ వారి ఇంటికీ వెళ్లి కుటుంబాన్ని పరామర్శించి రాములు చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమాల్లో హరిపిరాల బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు కొండ వెంకన్న, మాజీ సర్పంచి గద్దల భిక్షపతి, బీఆర్ఎస్ కార్యదర్శి మురళీ, పార్టీ సీనియర్ నాయకులు చెడిపెల్లి సోమయ్య, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

## కొమ్మూరి సత్తెమ్మకు ఘన నివాళి



**వరంగల్ వాయిస్, జనగామ :** మాజీ ఎమ్మెల్యే కొమ్మూరి ప్రతాపరెడ్డి తల్లి సత్తెమ్మ దశదినకర్మ సందర్భంగా వారి స్వగ్రామమైన నర్సాయిపల్లి గ్రామంలో ఆమె చిత్రపటానికి పలువురు ప్రముఖఉలు పూలమాలలు వేసి నివాళులర్పించారు.నియర్ న్యాయవాది పానుగంట శ్రీనివాస్, రైల్వే విశ్రాంత ఉద్యోగి తగరం వీరస్వామి, శ్రీ సాయి టైలర్స్ అధినేత చాట్ల రవి, సీనియర్ జర్నలిస్ట్ కొండ శ్రీనివాస్ పాల్గొన్నారు.

## ఉచిత కుట్టు మిషన్ పంపిణీ



**వరంగల్ వాయిస్, వరంగల్ :** ఎర్రం లలితాదేవి జ్ఞాపకార్థంగా వారి కుంటుబ సభ్యులు పేద మహిళలకు ఉచితంగా కుట్టు మిషన్ పంపిణీ చేశారు. లబ్ధిదారులు అక్కినపల్లి నిర్మల, జగవత్ జ్యోతి, మంద అరుణ, ఎస్కే కాశ్మీరీలకు కుట్టు మిషన్లు శనివారం అందజేశారు. ఈ సందర్భంగా ముఖ్య అతిథి తోట పూర్ణచందర్రావు మాట్లాడుతూ ప్రతి పేదవారిని ఆదుకునే ఉద్దేశంతో కుట్టుమిషన్ పంపిణీ చేయడం మంచి ఉద్దేశమన్నారు. ఇలాంటి మరిన్ని కార్యక్రమాలు చేపట్టి పేద కుటుంబాల్ని ఆదుకోవాలని కోరారు. తోట వైద్యనాథ్, జూలూరి పెద్ద, కడప సంజీవరావు, కొమరవెల్లి దయాకర్, పులకంద మోహన్ రావు, చిట్టి మల్ల విజయ్ కుమార్, మంచాల నాగవిర్, తాళ్ల వెంకన్న, చిన్నగాని రాణి జేమ్స్, నంగునూరి శ్రీశైలం, దిలీప్ కుమార్, తదితరులు పాల్గొన్నారు.

# జీవకోటికి ప్రాణధారం నీరు

## వెంకటాపూర్ తహసీల్దార్ గిరిబాబు



**వరంగల్ వాయిస్, వెంకటాపూర్ :** జీవకోటికి నీరే ప్రాణధారమని వెంకటాపూర్ తహసీల్దార్ గిరిబాబు అన్నారు. అంతర్జాతీయ జల దినోత్సవాన్ని పురస్కరించుకొని వెంకటాపూర్ మండల కేంద్రం లోని తహసీల్దార్ కార్యాలయం ఆవరణలో శనివారం చలివేంద్రం ఏర్పాటు చేశారు. కాగా, ఈ కార్యక్రమానికి తహసీల్దార్ గిరిబాబు ముఖ్య అతిథిగా హాజరై చలివేంద్రాన్ని ప్రారంభించారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో తహసీల్దార్ గిరిబాబు మాట్లాడారు. నీరు లేనిదే జీవం లేదని అన్నారు. భావితరాల భవిష్యత్తు కోసం ప్రతి నీటి బొట్టును ఒడిసి పట్టాలని పేర్కొన్నారు. వేసవి కాలాన్ని దృష్టిలో పెట్టుకొని వివిధ పనుల నిమిత్తం కార్యాలయానికి వచ్చే మండల ప్రజల కోసం తహసీల్దార్ కార్యాలయంలో చలి వేంద్రం ఏర్పాటు చేయటం జరిగిందని తెలిపారు. ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో ఆర్ఐ విజేందర్ తో పాటు కార్యాలయ సిబ్బంది, మండల ప్రజలు పాల్గొన్నారు.

## చర్లపల్లి పాఠశాలలో..



**వరంగల్ వాయిస్ నడికూడ :** మండలంలోని చర్లపల్లి ప్రాథమిక పాఠశాలలో ప్రపంచ నీటి దినోత్సవం సందర్భంగా శనివారం ప్రపంచ నీటి దినోత్సవం పై విద్యార్థులకు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి ప్రధాన ఉపాధ్యాయుడు అచ్చ సుదర్శన్ మాట్లాడుతూ పచ్చని చెట్లతో, పారే నదులతో, అందమైన పక్షులు, అలరించే జంతువులతో, ఎన్నో జీవుల్ని కలిగి వున్న గ్రహం ఈ భూమి. ఈ జీవులన్నిటి మనుగడకు కావలసినది నీరు. అటువంటి నీటిని జాగ్రత్తగా ఉపయోగించుకోవాలన్నారు. అనంతరం జల ప్రతిజ్ఞ చేశారు. పాఠశాల ఉపాధ్యాయులు కంచరాజు కుమార్, అంగన్వాడీ టీచర్స్ భీముడి లక్ష్మీ, నందిపాటి సంధ్యా, విద్యార్థిని, విద్యార్థులు పాల్గొన్నారు.

# నీటి పొదుపుతోనే మానవ మనుగడ




**వరంగల్ వాయిస్, వరంగల్ :** ప్రపంచ నీటి దినోత్సవం సందర్భంగా ఏవీవీ కళాశాల ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారి కొడిమాల శ్రీనివాసరావు ఆధ్వర్యంలో నీటి పొదుపు, మరియు వనరుల సంరక్షణ పై అవగాహన కార్యక్రమం, ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ప్రముఖ పర్యావరణ వేత్త డాక్టర్ రతన్ సింగ్ ఠాకూర్ ముఖ్యఅతిథిగా విచ్చేసి వలంటీర్లను ఉద్దేశించి మాట్లాడుతూ మానవాళి మనుగడకు నీరు ఎంతో ముఖ్యమని దీన్ని సంరక్షించాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరి పైన ఉందన్నారు. అలాగే కొడిమాల శ్రీనివాసరావు మాట్లాడుతూ విశ్వంలో (ప్రపంచం)లో మనకు లభిస్తున్న తాగునీరు, ఉపయోగకరమైన నీరు మూడు శాతం మాత్రమే అందులో 2.97 హిమానినదాలలోనే నిక్షిప్తమై ఉందన్నారు. ప్రస్తుతం గ్లోబల్ వార్మింగ్ తదితర పర్యావరణ మార్పులతో హిమనీనాదాలు కరుగుతున్నాయని తెలిపారు. ప్రతి ఒక్కరూ వారి వారి గ్రామాలలో, ప్రాంతాలలో నీటి పొదుపు, పర్యావరణ పరిరక్షణ పై ప్రజలకు అవగాహన కలిగించి భవిష్యత్ తరాలకు మంచినీటి అందించాల్సిన బాధ్యత ఉందన్నారు. ఈ కార్యక్రమంలో పర్యావరణ కార్యకర్తలు విజయరావు, సర్వేశం, రాజు ఎన్ఎస్ఎస్ సీనియర్ వాలంటీర్లు ఫయాజ్, ప్రమోద్, దేవిశ్రీప్రసాద్, వెంకటరమణ, అఖిల్, హరిణి, మన్విత, నవ్య మిన్ను, సిద్ధూ, చిరంజీవి ,సాయి హర్షిత్ ,రాజ్ కుమార్ ,హేమంత్ పాల్గొన్నారు.

# నీటిని సంరక్షిద్దాం.. కరువును తరిమికొడదాం




## ■ ఘనంగా ప్రపంచ నీటి దినోత్సవం

**వరంగల్ వాయిస్, తొర్రూరు :** "ప్రపంచ నీటి దినోత్సవం మార్చి 22ను" పురస్కరించుకొని, వరంగల్ జిల్లా భూగర్భ శాఖ సహకారంతో, మార్పు సొసైటీ ఆధ్వర్యంలో రాయపర్తి మండలం ఊకల్ గ్రామంలో, నీటిని సంరక్షిద్దాం.. కరువు తరిమికొడదాం.. అని నినాదాలు చేస్తూ ర్యాలీని నిర్వహించారు. అనంతరం రైతులకు, పాఠశాల విద్యార్థులకు అవగాహన సదస్సు ఏర్పాటు చేయడం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా జిల్లా జియాలజిస్ట్ బైరి రవి, భూగర్భ శాఖ జిల్లా డీఅధికారి మెరుగు అశోక్, క్లస్టర్ ఏఈఓ పసరగొండ మనస్విని విచ్చేసి మాట్లాడారు. రోజురోజుకు భూగర్భ జలాలు అడుగంటి పోతున్నాయని, భూగర్భ జలాలను కాపాడుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. భవిష్యత్ తరాలకు మనం ఇచ్చే గొప్ప వరం నీరేనన్నారు. నీటిని పొదుపుగా వాడుకోవడం ద్వారా ఎక్కువ విస్తీర్ణం సాగు చేసుకోవచ్చన్నారు. రైతులు అధునాతన పద్ధతులను పట్ల అవగాహన కలిగి ఉండాలన్నారు. పంట మార్పిడి చేసుకుని అధిక లాభాలు పొందాలని సూచించారు. ఈ కార్యక్రమంలో, మార్పు సొసైటీ వరంగల్ జిల్లా కో-ఆర్డినేటర్ పోరెల్ల విప్లవ్, అడిషనల్ కో-ఆర్డినేటర్లు, గాదేపాక శ్రీనివాస్, తోడేటి అంజనేయులు, రాయపర్తి సొసైటీ చైర్మన్ రామచంద్రారెడ్డి, హైడ్రాలజిస్ట్ సర్దార్ గురుదేవ్ సింగ్, క్లస్టర్ ఏఈవోలు క్రాంతి, సాయి, సామాజిక కార్యకర్తలు పోలేపాక భిక్షపతి, చిన్నపాక రాంబాబు, గ్రామ రైతులు, గొల్లపల్లి సదా శ్రీనివాస్, లెక్కల నారాయణరెడ్డి, సుభాష్ రెడ్డి, మూడుకే యాకయ్య, బూడిద రవి, పోలేపాక శ్రీను, కందుకూరి రాములు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

# భూగర్భ జలాలపై అవగాహన సదస్సు

**వరంగల్ వాయిస్, కురవి:** ప్రపంచ నీటి దినోత్సవాన్ని పురస్కరించుకుని భూగర్భజల శాఖ ఆధ్వర్యంలో శనివారం కురవి మండల కేంద్రంలోని రైతు వేదికలో భూగర్భ జలాలపై అవగాహన సదస్సును నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన జిల్లా వెనుకబడిన తరగతుల సంక్షేమ శాఖ అధికారి నరసింహస్వామి మాట్లాడుతూ నీటి వృధాను అరికట్టాలని, ఇంకుడు గుంతల నిర్మాణాన్ని విరివిగా చేపట్టాలని సూచించారు. భూగర్భ జలాల సంరక్షణ భవిష్యత్ తరాల కోసం ఎంతో కీలకమని ఆయన వివరించారు. జిల్లా భూగర్భజల శాఖ అధికారి వేముల సురేష్ మాట్లాడుతూ, జిల్లాలో వ్యవసాయ రంగం ప్రధానంగా భూగర్భ జలాలపై ఆధారపడినందున, వాటిని పెంపొందించేందుకు రైతులు వర్షపు నీటిని నిల్వ చేసుకోవడానికి నీటి కుంటల నిర్మాణంపై దృష్టి పెట్టాలని సూచించారు. అదనపు భూగర్భ జల వినియోగాన్ని తగ్గించేందుకు, ఆరుతడి పంటలను ప్రోత్సహించడంతో పాటు బిందు సేద్యం పద్ధతులను పాటించాల్సిన అవసరం ఉందని తెలిపారు. అలాగే, బోర్ వెల్ పాయింట్ ల కోసం రైతులు తగిన శాస్త్రీయ విధానాలను అనుసరించాలనీ, భూగర్భజల శాఖ ద్వారా సర్వే నిర్వహించుకోవడం ఉత్తమ మార్గమని సూచించారు. విద్యార్థుల ద్వారా నీటి పొదుపు, భూగర్భజలాల సంరక్షణ విధానాలను కుటుంబ సభ్యులకు, రైతులకు, మహిళలకు చేరువ చేయడం తమ ప్రధాన లక్ష్యమని ఆయన పేర్కొన్నారు. ఈ అవగాహన కార్యక్రమంలో విద్యార్థులకు భూగర్భ జలాల ప్రాముఖ్యత, భవిష్యత్ సవాళ్లు, స్థిరమైన భూగర్భజల నిర్వహణ చర్యల గురించి వివరించారు. సదస్సు సందర్భంగా విద్యార్థులకు వ్యాసరచన, చిత్రలేఖనం, వక్తృత్వ పోటీలు నిర్వహించి, విజేతలకు అతిథులచే బహుమతులు అందజేశారు. జిల్లాలో భూగర్భ జలాలను ఉత్తమంగా నిర్వహిస్తున్న విద్యా విభాగంలో హెర్బ్ కంపెనీ, పరిశ్రమల విభాగంలో మైనింగ్ శాఖ నుంచి గాయత్రి గ్రానైట్స్, వ్యవసాయ విభాగంలో భూక్య రవికుమార్, తోటల విభాగంలో భాస్కర్‌ను సన్మానించారు.

కార్యక్రమంలో మండల రెవెన్యూ అధికారి సునీల్ రెడ్డి, మండల పరిషత్ అభివృద్ధి అధికారి వీరబాబు, సహాయ భూగర్భజల అధికారులు శ్రీనివాస్, స్నేహ, చేతన్, సహాయ వ్యవసాయ అధికారి మురళి, పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, రైతులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

# జలం పొదుపుతో ప్రకృతి అదుపు




## ■ సామాజికవేత్త డాక్టర్ పరికిపండ్ల అశోక్

**వరంగల్ వాయిస్, మానుకోట :** ప్రకృతి ఇచ్చిన వరాలైన నేల, గాలి, నీరును పొదుపుగా వాడినప్పుడే పర్యావరణం అదుపులో ఉంటుందని, భూగర్భ జలాలను తవ్వితోడినంత నీటిని మళ్లీ భూమి పొరల్లోకి చేర్చగల పరిజ్ఞానాన్ని సాధించినప్పుడే మనిషి ప్రకృతిని కాపాడిన వాడు అవుతాడని, ముంచుకొస్తున్న నీటి సమస్య గురించి ప్రతి ఒక్కరూ చర్చించుకోవాలని ప్రముఖ సామాజికవేత్త డాక్టర్ పరికిపండ్ల అశోక్ కోరారు. గురువారం జిల్లా కేంద్రంలోని అడ్వకేట్స్ కాలనీలో ప్రపంచ జల దినోత్సవాన్ని పురస్కరించుకొని ఆరోగ్య మిత్ర స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన కార్యక్రమంలో డాక్టర్ అశోక్ మాట్లాడుతూ ప్రపంచంలో భారీ యుద్ధాలలో చనిపోయిన వారి కంటే కలుషిత నీటి సమస్యతో చనిపోయిన వారి సంఖ్య ఎక్కువగా ఉంటూ ఏడాదికి 40 లక్షలు చేరిందని, భూమి మీద ఉన్న మూడు వంతుల నీటిలో 97శాతం ఉప్పునీరు కాగా మూడు శాతమే మంచినీరు అని అందులో రెండు శాతం మంచినీరు రూపంలో ఉండగా, మిగతా ఒక్క శాతం నీటిలో 0.6శాతం భూగర్భంలో ఉంటే మిగతాది నదులు సరస్సుల రూపంలో ప్రవహిస్తుందని, ప్రపంచంలో ప్రవహించే 500 పైగా నదులు కలుషితమయ్యాయని, సమీప భవిష్యత్తులో 48 దేశాల్లో తీవ్రమైన నీటి కొరత ఏర్పడబోతుందని హెచ్చరించారు. ప్రతి ఒక్కరూ సామాజిక బాధ్యతగా నీటి కాలుష్యాన్ని అరికడుతూ, పొదుపును పాటించాలని కోరారు. అనంతరం పాల్గొన్న వారిచే నీటి పొదుపుని పాటిస్తామని జల ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ సుంకరనేని నాగవాణి, కౌన్సిలర్ డాక్టర్ రమేష్, సూపర్ వైజర్ ఉషారాణి, ఉమా, సరోజ, సుగుణ, సంధ్య, జ్యోతి, శుభ, పద్మావతి, మనీషా లతో పాటు ఆరోగ్యం మిత్ర స్వచ్ఛంద సంస్థ ప్రతినిధి సహజ తదితరులు పాల్గొన్నారు.



# లూసీఫర్-2 మోహన్‌లాల్ రెమ్యునరేషన్ ఎంతటే..?

మలయాళ నటుడు, దర్శకుడు పృథ్వీరాజ్ సుకుమారన్ దర్శకత్వంలో వస్తున్న తాజా చిత్రం ఎల్2 ఎంపురాన్. బ్లాక్ బస్టర్ చిత్రం లూసీఫర్ సినిమాకి ఈ చిత్రం సీక్వెల్‌గా వస్తుంది. మలయాళీ సూపర్ స్టార్ మోహన్ లాల్ ప్రధాన పాత్రలో నటిస్తుండగా.. మంజు వారియర్, టోవినో థామస్ కీలక పాత్రల్లో నటిస్తున్నారు. ఈ చిత్రం మార్చి 27న ప్రేక్షకుల ముందుకు రానుంది. ఈ సందర్భంగా వరుస ప్రమోషన్స్‌లో పాల్గొంటున్నాడు పృథ్వీరాజ్. అయితే ఈ సినిమాకు మోహన్ లాల్ తీసుకున్న పారితోషికం గురించి ఆసక్తికర వ్యాఖ్యలు చేశాడు పృథ్వీరాజ్. ఆయన మాట్లాడుతూ.. లల్లెట్టన్ (మోహన్‌లాల్) వలనే ఈ సినిమా సాధ్యమైంది. మోహన్‌లాల్ ఈ చిత్రం కోసం చాలా కష్టపడ్డాడు. ఒక దర్శకుడిగా, నేను నిర్మాతల గురించి ప్రతి క్షణం ఆలోచిస్తాను. మనం ఖర్చు చేసే ప్రతి రూపాయికి విలువ ఇవ్వాలని భావిస్తాను. 'లూసిఫర్ 2: ఎంపురాన్' కోసం మోహన్‌లాల్ ఒక్క పైసా కూడా రెమ్యూనరేషన్ తీసుకోలేదు. ఆయన పారితోషికం వదులుకోవడం వల్లే ఈ సినిమా తెరకెక్కిందని చెప్పడంలో సందేహం లేదు. ఆయన రెమ్యూనరేషన్‌ను కూడా సినిమా నిర్మాణానికి ఉపయోగించాం. స్క్రీన్‌పై చూస్తే ఆ విషయం మీకు స్పష్టంగా అర్థమవుతుంది. గేమ్ ఆఫ్ థోర్న్స్ నటుడు జెరోమ్ ఫ్లిన్‌తో పాటు చాలా మంది విదేశీ నటులు ఇందులో పాల్గొన్నారు. వారంతా సినిమాకి చాలా సహకారం అందించారంటూ పృథ్వీరాజ్ చెప్పుకొచ్చాడు.



# అది కంప్లీట్ అయ్యే వరకూ..

## అది విని నేను షాక్ అయ్యాను: నిధి అగర్వాల్

సవ్యసాచి సినిమాతో టాలీవుడ్‌లోకి ఎంట్రీ ఇచ్చింది యువ కథానాయకి నిధి అగర్వాల్. ఈ సినిమా అనంతరం మిస్టర్ మజ్ను చేసిన కూడా రెండు సినిమాలు పెద్దగా బ్రేక్‌ని అందించలేకపోయాయి. అయితే పూరీ జగన్నాథ్ దర్శకత్వంలో వచ్చిన 'ఇస్మార్ట్‌శంకర్'తో బ్లాక్‌బాస్టర్ హిట్ కొట్టేసింది ఈ భామ. ఆ తర్వాత తెలుగుతో పాటు తమిళ చిత్రాల్లో నటించి మంచి గుర్తింపు తెచ్చుకుంది. అయితే ఈ భామ తన కెరీర్ ప్రారంభంలో జరిగిన ఒక సంఘటన గురించి తాజాగా పంచుకుంది. తన మొదటి సినిమా టైంలో హీరోతో డేట్ చేయవద్దని చిత్రయనిట్ బాండ్ రాయించుకున్నారని తెలిపింది. బాలీవుడ్ సీనియర్ నటుడు జాకీ ష్రాఫ్ తనయుడు టైగర్ ష్రాఫ్ హీరోగా నటించిన 'మున్నా మైఖేల్' సినిమాతో బాలీవుడ్‌లో నా సినీ ప్రస్థానం మొదలైంది. ఈ సినిమాకు ఒకే చెప్పిన తర్వాత చిత్రయూనిట్ నాతో ఒక కాంట్రాక్ట్‌పై సంతకం చేయించింది. ఆ కాంట్రాక్ట్‌లో సినిమాకు సంబంధించి నేను పాటించాల్సిన నియమాలు ఉన్నాయి. అందులో'నో డేటింగ్' అనే షరతు కూడా ఉంది. దానికి అర్థం సినిమా కంప్లీట్ అయ్యేవరకు నేను హీరోతో నేను డేటింగ్ చేయకుడదని. అయితే ఇది చూడాకుండా నేను సంతకం పెట్టాను. తర్వాత ఈ విషయం తెలిసి నేను చాలా షాక్ అయ్యాను. నటీనటులు ప్రేమలో పడితే పనిపై శ్రద్ధ తగ్గుతుందని టీమ్ భావించి ఉంటుంది. అందుకే ఇలాంటి నిబంధనలు జోడిరచి ఉంటారని అనుకున్నానంటూ నిధి చెప్పుకొచ్చింది. సినిమాల విషయానికి వస్తే.. నిధి ప్రస్తుతం పవన్ కళ్యాణ్‌తో కలిసి 'హరి హర వీరమల్లు' చిత్రంలో నటిస్తుంది. ఈ చిత్రం మే 09న ప్రేక్షకుల ముందుకు రానుంది.

# బెట్టింగ్ యాప్‌ను ప్రమోట్ చేసిన మెట్రో...

## ప్రభుత్వాన్ని నిలదీసిన అనన్య నాగళ్ల

బెట్టింగ్ యాప్ వివాదం రెండు తెలుగు రాష్ట్రాలను కుదిపేస్తున్న విషయం తెలిసిందే. ఇప్పటికే ఈ విషయంలో సీరియస్ అయిన తెలంగాణ పోలీసులు పలువురిపై కేసు నమోదు చేశారు. కాగా ప్రస్తుతం ఈ కేసుకు సంబంధించి విచారణ కొనసాగుతోంది. ఇదిలావుంటే బెట్టింగ్ యాప్స్ ప్రమోట్ చేసినందుకు సినీ ప్రముఖులపై నెటిజన్లు దుమ్మెత్తిపోస్తున్న విషయం తెలిసిందే. నటి అనన్య నాగళ్లను బెట్టింగ్ యాప్స్ ప్రమోట్ చేసినందుకు సోషల్ మీడియాలో తిట్టడం మొదలుపెట్టారు. అయితే తనపై వస్తున్న విమర్శలపై స్ట్రాంగ్ కౌంటర్ ఇచ్చింది అనన్య. బెట్టింగ్ యాప్స్ ప్రభుత్వమే ప్రమోట్ చేస్తుంటే మాకేలా తెలుస్తుంది అంటూ ప్రశ్నించింది. ఈ సందర్భంగా హైదరాబాద్ మెట్రో ప్రమోట్ చేస్తున్న వన్ ఎక్స్ బెట్టింగ్ యాప్ ఫొటోను పంచుకుంది. ప్రభుత్వానికి చెందిన సంస్థ (హైదరాబాద్ మెట్రో) బెట్టింగ్ యాప్‌ను ప్రమోట్ చేస్తుంటే అవి చట్టవిరుద్ధంగా ప్రమోట్ చేయబడుతున్నాయని మనం ఎలా తెలుసుకోవాలి అంటూ అనన్య ఇన్‌స్టాలో రాసుకొచ్చింది. మరోవైపు తాను బెట్టింగ్ యాప్స్ ప్రమోట్ చేసినందుకు క్షమాపణలు తెలిపింది అనన్య. 'దయచేసి నన్ను క్షమించండి. నేను తెలిసి తప్పు చేయలేదు. అందరూ టాప్ సెలబ్రిటీలు చేస్తున్నారు కాబట్టి తప్పు కాదని అనుకున్నాను. ఇప్పటినుంచి చాలా జాగ్రత్తగా బాధ్యతగా ఉంటాను. మళ్లీ ఇలాంటి పొరపాటు జరగకుండా చూస్తాను. అప్పట్లో ఆలోచన లేకుండా, అవగాహన లేని స్థితిలో ఈ పని చేశాను. ఒక వీడియో స్టోరీ పోస్ట్ చేసినందుకు వాళ్లు రూ.1,20,000 చెల్లించారు. అప్పుడు నేను దాన్ని కేవలం గేమింగ్ యాప్‌గా, ఒక సాధారణ యాడ్‌గా మాత్రమే చూశాను. కానీ అది బెట్టింగ్ యాప్ అని, దీని వెనుక ఇన్ని సమస్యలు ఉంటాయని అప్పట్లో గ్రహించలేకపోయాను. తర్వాత వాళ్లు ఇచ్చిన డబ్బును కూడా వెనక్కి ఇచ్చేశాను అంటూ అనన్య చెప్పుకొచ్చింది.






# టాలీవుడ్‌పై ఆశలు పెట్టుకున్న అవికాగోర్

చిన్నారి పెళ్లి కూతురు సీరియల్ ద్వారా దక్షిణాది ప్రేక్షకులకు ఇష్టమైన నటిగా మారింది అవికా గోర్. బాలనటిగా బుల్లితెరపై సందడి చేసిన ఈ అమ్మడు.. ఇప్పుడు హీరోయిన్‌గా వెండితెరపై అలరిస్తుంది. ఈ అమ్మడి అందాలకు కుర్రాళ్ళు ఫిదా అవుతున్నారు. చిన్నారి పెళ్లి కూతురు సీరియల్ తో తెలుగు వారికి బాగా దగ్గరయ్యింది అవికా గోర్. చిన్నారి పెళ్లి కూతురు సీరియల్ తో తెలుగు వారికి బాగా దగ్గరయ్యింది అవికా గోర్. ఆ తర్వాత రాజ్ తరుణ్ నటించిన ఉయ్యాలా జంపాల సినిమాతో హీరోయిన్ గా వెండితెరకు పరిచయమైంది. ఈ సినిమా మంచి విజయాన్ని అందుకుంది. ఇందులో ఆమె నటనకు మంచి మార్కులు పడ్డాయి. సినిమా కూడా హిట్ కావడంతో వరుసగా అవకాశాలు వచ్చాయి. వచ్చిన అవకాశాలను సద్వినియోగం చేసుకుంటూ సినిమాలు చేసి మంచి గుర్తింపు తెచ్చుకుంది ఈ ముద్దుగుమ్మ. గత కొద్దిరోజులుగా అవికా గోర్ తెలుగు సినిమాలకు దూరంగా ఉంటుంది. బాలీవుడ్ లో ఎక్కువగా ఫోకస్ పెట్టింది. అక్కడ సినిమాలు, వెబ్ సిరీస్ లు చేస్తూ అభిమానులను ఆకట్టుకుంటుంది. ఇక ఇప్పుడు తెలుగులో మరోసారి అదృష్టం పరీక్షించుకుంది. అది సాయి కుమార్ హీరోగా షణ్ముఖ అనే సినిమాలో నటించింది. హారర్ థ్రిల్లర్‌గా తెరకెక్కిన ఈ సినిమా శుక్రవారం విడుదలైంది. ఆశించిన స్థాయిలో ఈ సినిమాలో ఆకట్టుకోలేకపోయింది. మరి ఈ సినిమా తర్వాత వరుసగా సినిమాలు చేస్తుందా లేదా అన్నది చూడాలి.



# నాసిరకం పురుగు మందుల విక్రయ ముఠా అరెస్ట్

- పోలీసుల అదుపులో ఏడుగురు
- పరారీలో ఒకరు, జైలులో మరొకరు
- వివరాలు వెల్లడించిన సీపీ సన్‌ప్రీత్ సింగ్

**వరంగల్ వాయిస్, క్రైం :** అమాయక వ్యవసాయదారులను లక్ష్యంగా చేసుకొని ప్రముఖ కంపెనీల పేర్లతో పాటు గడువు తీరిన పురుగు మందులు విక్రయిస్తున్న ముఠాలోని ఏడుగురిని టాస్క్‌ఫోర్స్, మట్టెవాడ పోలీసులు సంయుక్తంగా శనివారం అరెస్ట్ చేయగా ఒకరు పరారీలో, మరొకరు జైలులో ఉన్నారు. నిందితుల నుంచి సుమారు రూ.78.63 లక్షల విలువ కలిగిన గడువు తీరున, నకిలీ పురుగు మందులు, నకిలీ విత్తనాలతోపాటు పురుగు మందుల తయారీకి ఉపయోగించిన మిషనరీ, ప్రింటింగ్ సామగ్రి, రెండు కార్లు, ఆరు సెల్‌ఫోన్లను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. అరెస్ట్ చేసిన వారిలో మట్టెవాడ ప్రాంతానికి చెందిన ఇరుకుల్ల వేదప్రకాశ్, లక్ష్మీ పురంకు చెందిన మహ్మద్ సిద్దిక్ ఆలీ, పెద్దపల్లి జిల్లా సుల్తాన్‌బాద్ కు చెందిన నూక రాజేష్ ఆలియాస్ రాజు, కరీంనగర్ కు చెందిన యల్లం సదాశివుడు, ములుగు జిల్లా గొవిందరావుపేటకు చెందిన ఎండి రఫీక్, ప్రకాశం జిల్లా మడుగుకు చెందిన ఆళ్లచేరువు శేఖర్, వరంగల్ జిల్లా దుగ్గొండికి చెందిన పొదిళ్ళ సాంబయ్య పోలీసుల అదుపులో ఉండగా విష్ణు వర్ధన్ పరారీలో ఉన్నాడు. హైదరాబాద్ కు చెందిన ముద్దగుల ఆదిత్య ప్రస్తుతం జైలులో ఉన్నట్లు వరంగల్ పోలీస్ కమిషనర్ సన్‌ప్రీత్ సింగ్ వెల్లడించారు.

## ముగ్గురు చైన్ స్నాచర్ల అరెస్ట్..

మూడు వేర్వేరు సంఘటనల్లో గొలుసు దొంగతనాలకు పాల్పడిన ముగ్గురు చైన్ స్నాచర్లతో పాటు కారులో ఉన్న డబ్బు బ్యాగును చోరీ చేసిన కారు డ్రైవర్‌ను పోలీసుల అరెస్టు చేశారు. ఈ మూడు సంఘటనల్లో పోలీసులు సుమారు రూ.4.90లక్షల విలువగల 77.750 గ్రాముల బంగారంతో పాటు రూ. 8.10 లక్షల నగదు, ఒక ఆటో, ఒక ద్విచక్ర వాహనం, రెండు సెల్‌ఫోన్లను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఈ అరెస్టులకు సంబంధించి వరంగల్ పోలీస్ కమిషనర్ సన్‌ప్రీత్ సింగ్ వివరాలను వెల్లడించారు. వరంగల్ కోటకు చెందిన చాపర్తి రాజేష్ ఇస్త్రీ షాపు నిర్వహిస్తూ సులభంగా డబ్బు సంపాదించాలనే అలోచనతో చైన్ స్నాచింగ్ కు పాల్పడినట్లు వివరించారు. ఈ నెల 11వ తారీకున హనుమకొండ రెడ్డి కాలనీలో ఒంటరిగా వెళ్ళుతున్న ఓ మహిళ మెడలో ఉన్న రెండున్నర తూలాల బంగారు గొలుసును ద్విచక్ర వాహనంపై బలవంతంగా లాక్కోని అక్కడి నుండి తప్పించుకొని పోయినట్లు తెలిపారు. యాడు. హనుమకొండ జిల్లా గోకుల్ నగర్ లో నివాసముంటున్న ఐనవోలుకు చెందిన తాళ్ళపల్లి సంపత్ కుమార్ ఆటో డ్రైవర్‌గా పనిచేస్తూ, వచ్చిన డబ్బులతో బెట్టింగ్ యాప్‌ల ద్వారా బెట్టింగ్ కాసి డబ్బులు నష్టపోయి ఆటో రుణానికి సంబంధించి నెలసరి వాయిదాలు కట్టకపోవడం సులభంగా డబ్బు సంపాదించాలను కున్నాడు. శుక్రవారం కాజీపేటలోని కిరాణ షాపులో బిస్కెట్ ప్యాకెట్ కొనుగోలు చేస్తున్నట్లుగా నటిస్తూ సదరు షాపు యజమానురాలి మెడలోని రోల్డ్‌గోల్డ్ గొలుసును లాక్కొని అక్కడి నుంచి ఆటోలో పారిపోయారు. వనస్థలి పురంలో నివాసం ఉంటున్న కర్నాటకకు చెందిన కార్తిక్ హైదరాబాద్‌లో హోటళ్ళ వ్యాపారం నిర్వహించే స్వాతి కిరణ్ వద్ద కారు డ్రైవర్‌గా పనిచేసేవాడు. నిండితుడు జల్సాలకు అలవాటు పడ్డాడు. సులభంగా సంపాదించాలనుకున్న నిందితడు ఆవకాశం కోసం ఎదురు చూసాడు. కారు యాజమాని తన వ్యాపార భాగస్వామి గూడమల్ల వినయ్‌కుమార్ కలిసి కారులో ఈ నెల 18వ తేదిన కాజీపేటకు చేరుకొని ఇక్కడే హోటల్ వ్యాపారం లావాదేవీల సంబంధించి రూ.8లక్షల నగదు తీసుకొని తాను ప్రయాణిస్తున్న కారులో వెనుక భాగంలో భద్రపర్చాడు. రాత్రి 9గంటలకు భీమారంలోని ఒక హోటల్‌లో రూంలో సేదతీరిన వ్యాపారస్తులు నిందితుడైన కారు డ్రైవర్ భోజనానికి వెళ్ళుతున్నట్లు వెళ్ళి కారులో వ్యాపారస్తులు భద్రపర్చిన క్యాష్ బ్యాగ్‌ను దొంగలించి అక్కడి నుంచి పారిపోయినాడు. ఈ సంఘటనపై వ్యాపాస్తులు ఇచ్చిన ఫిర్యాదు అధారంగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టిన కేయూసి ఇన్స్ స్పెక్టర్ రవికుమార్. టెక్నాలజీని వినియోగించుకోని ఈ రోజు ఉదయం హైదరాబాద్ వనస్థలిపురంలో నిందితుడుని అరెస్టు చేసిన అతని వద్ద వున్న 8లక్షల రూపాయల నగదును స్వాధీనం చేసుకున్నారు.



# ఘనంగా అనఘాష్టమి వ్రతాలు



బహుళ అష్టమి సందర్భంగా శనివారం ములుగు రోడ్డులోని శ్రీ గణపతి సచ్చిదానంద వరద దత్త క్షేత్రంలో సామూహిక శ్రీ అనఘాష్టమి వ్రతాలను దత్త ప్రచారక్ కొక్కుల రాజేంద్రప్రసాద్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు.
అనంతరం భక్తులందరికీ తీర్థ ప్రసాదం అన్న ప్రసాదం వితరణ నిర్వహించడం జరిగినది. ఈ కార్యక్రమానికి ట్రస్ట్ సభ్యులు, అధిక సంఖ్యలో మహిళా భక్తులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమాన్ని ఎస్ జీఎస్ దత్త జ్ఞాన బోధ సభ వరంగల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు.

**- వరంగల్ వాయిస్, వరంగల్**



# ధాన్యం కొనుగోళ్లకు 206 కేంద్రాలు

**వరంగల్ వాయిస్, వరంగల్ :** జిల్లాలో రబీ ధాన్యం కొనుగోళ్లకు 206 కేంద్రాలు ఏర్పాటు చేయనున్నట్లు జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద తెలిపారు. శనివారం కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో కలెక్టర్, అదనపు కలెక్టర్ సంధ్యారాణి తో కలిసి 2024-25 ఎండాకాలం ధాన్యం కొనుగోళ్లపై సంబంధిత అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ గత ఖరీఫ్‌లో జిల్లాలో ఎక్కడా లోటుపాట్లు లేకుండా ధాన్యం కొనుగోలు చేశామన్నారు. ప్రస్తుత అంచనా ప్రకారం రబీకి సంబంధిం 2,14,513 మెట్రిక్ టన్నుల సన్నరకం, 44,912 మెట్రిక్ టన్నుల దొడ్డు రకం ధాన్యం.. మొత్తం 2,59,425 మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేసేందుకు లక్ష్యంగా పెట్టుకున్నామని తెలిపారు. రైతులకు అనుకూలంగా కొనుగోలు కేంద్రాల ఏర్పాటు ఉండాలని, కొనుగోలు చేసిన వెంటనే ట్యాబ్‌లో ఎంట్రీ చేసేలా ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు. ప్రాథమిక అంచనా ప్రకారం ఏప్రిల్ మొదటి వారం నుంచి వరి కోతలు ప్రారంభమవుతాయని, కొనుగోలు కేంద్రాలకు నాణ్యమైన ధాన్యం తీసుకొచ్చే షెడ్యూల్ పకడ్బందీగా తయారు చేయాలని సూచించారు. జిల్లా సరిహద్దుల్లో అవసరమైన చెక్ పోస్టులు ఏర్పాటు చేసి పొరుగు రాష్ట్రాల నుంచి సన్న రకం వడ్లు రాకుండా చూడాలన్నారు. కొనుగోలు కేంద్రాల్లో అవసరమైన మౌలిక వసతులు కల్పించాలని, ప్యాడీ క్లీనర్, వేయింగ్, తేమ యంత్రాలు ఏర్పాటు చేయాలన్నారు. వేయింగ్, తేమ యంత్రాల పనితీరును చెక్ చేసి సర్టిపై చేయాలన్నారు. ప్రతి కొనుగోలు కేంద్రంలో త్రీ ఫేస్ విద్యుత్ ఉండాలని అన్నారు. అవసరమైన గన్ని సంచులు, అకాల వర్షాల నుంచి పంటను కాపాడేందుకు వీలుగా టార్పాలిన్లు అందుబాటులో ఉంచాలన్నారు. కేంద్రాల వద్ద అవసరమైన మేరకు హమాలీలు ఉండేలా చూసుకోవాలన్నారు. ఈ సమావేశంలో డీఆర్డీవో కౌసల్య దేవి, జిల్లా పౌరసరఫరాల శాఖ అధికారి కిష్టయ్య, జిల్లా వ్యవసాయ శాఖ అధికారి అనురాధ, పౌరసరఫరాల జిల్లా మేనేజర్ సంధ్యారాణి, జిల్లా మార్కెటింగ్ అధికారి సురేఖ, జిల్లా సహకార అధికారి నీరజ తదితరులు పాల్గొన్నారు.

# ఏప్రిల్ 14 నాటికి జంక్షన్ సుందరీకరణ పూర్తి

- జిల్లా కలెక్టర్ ప్రావీణ్య



**వరంగల్ వాయిస్, హనుమకొండ :** హనుమకొండ జిల్లా ఎల్కతుర్తి మండల కేంద్రంలో కాకతీయ పట్టణాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో చేపట్టిన ఎల్కతుర్తి జంక్షన్ సుందరీకరణ పనులను ఏప్రిల్ 14వ తేదీ నాటికి పూర్తి చేయాలని హనుమకొండ జిల్లా కలెక్టర్ పి.ప్రావీణ్య సంబంధిత శాఖల అధికారులను ఆదేశించారు. శనివారం హనుమకొండ జిల్లా కలెక్టరేట్ లో కుడా వైస్ ఛైర్మెన్ అశ్విని తానాజీ వాకడే, అదనపు కలెక్టర్ వెంకట్ రెడ్డి, ఆర్డీవో రాథోడ్ రమేష్ లతో కలిసి ఎల్కతుర్తి జంక్షన్ సుందరీకరణ, అభివృద్ధి పనుల పురోగతిపై కుడా, రెవెన్యూ, ఆర్టీసీ, విద్యుత్, తదితర శాఖల అధికారులతో సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ ప్రావీణ్య మాట్లాడుతూ ఎల్కతుర్తి జంక్షన్ సుందరీకరణ, ఇతర అభివృద్ధి పనులను త్వరితగతిన పూర్తయ్యే విధంగా అధికారులు చర్యలు చేపట్టాలన్నారు. జంక్షన్ చుట్టూ గ్రిల్స్ ఏర్పాటు చేయడం, పచ్చదనం కోసం లాన్, మొక్కలు నాటడం, హైమాస్ట్ లైట్లు ఏర్పాటు చేయడం, డ్రైనేజ్ నిర్మాణం తదితర పనులు నాణ్యతగా పూర్తి చేయాలన్నారు. ఈ సమావేశంలో కుడా పీవో అజిత్ రెడ్డి, ఈఈ భీమ్ రావు, తహసీల్దార్ జగత్ సింగ్, ఎంపీడీవో విజయ్ కుమార్, ఆర్టీసీ, ఇతర శాఖల అధికారులు పాల్గొన్నారు.

## అంగన్వాడీల్లో పెండింగ్ పనులపై సమీక్ష..

అంగన్వాడీ కేంద్రాలలో పెండింగ్ లో ఉన్న పనులను త్వరగా పూర్తయ్యేలా అధికారులు చర్యలు చేపట్టాలని హనుమకొండ జిల్లా కలెక్టర్ పి.ప్రావీణ్య అన్నారు. శనివారం హనుమకొండ జిల్లా కలెక్టరేట్ లోని మినీ కాన్ఫరెన్స్ హాల్ లో అంగన్వాడీ కేంద్రాల భవనాలలో తాగునీరు, విద్యుత్, టాయిలెట్స్, మరమ్మతు పనుల పురోగతిపై వివిధ శాఖల అధికారులతో సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. ఈ సమావేశంలో జిల్లా సంక్షేమ అధికారి జయంతి, ఇతర శాఖల అధికారులు, సీడీ పీవోలు పాల్గొన్నారు.

EDITED, PRINTED, PUBLISHED AND OWNED BY GADDAM KESHAVA MURTHY, PRINTED AT MANIKANTA GRAPHICS, H.NO.4-10-121, KUMARPALLY, HANAMKONDA, WARANGAL URBAN DISTRICT-506001, TELANGANA STATE, PUBLISHED AT H.NO. 4- 7-138/1, KUMARPALLY, HANAMKONDA, WARANGAL.-506001. WARANGAL URBAN DISTRICT, TELANGANA STATE.
EDITOR : GADDAM KESHAVA MURTHY. RNI NO: TELTEL/2021/80377, PHONE NO : 8008794162, MAIL ID : gaddamkeshavamurthy@gmail.com